సాక్షి
గుంటూరు
శుక్రవారం । 10 । నవంబర్ । 2023



15న దుర్గమ్మకు గాజుల అలంకారం

విజయవాడ: కార్తిక శుద్ధ విదియను పురస్కరించుకుని ఈ నెల 15న ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గాజులతో విశేషంగా అలంకరించనున్నారు.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

26న పోటీ పరీక్షలపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్స్‌తోపాటు. గ్రూప్–1, 2 పరీక్షలపై ఈనెల 26న ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు టార్గెట్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ అన్నపురెడ్డి ఉషారాణి గురువారం తెలిపారు. 9010304089 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



న్యూస్‌రీల్

నేడు గాంధీ పార్క్ ప్రారంభం



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఆధునిక హంగులతో అభివృద్ధి చేసిన గుంటూరు నగరంలోని గాంధీ పార్కును శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం తెలియజేశారు.

త్రికోటేశ్వరుని ఆదాయం రూ.19.82 లక్షలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.19,82,977లు ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు మట్లా లింగారెడ్డి, వంపుగుడి జానకయ్య, గుంటూరు లక్ష్మీ, చిలంకూరి యోగేశ్వరరావు, మాడిశెట్టి స్వర్ణ, దివ్వెల రామకృష్ణ, మాజీ సభ్యుడు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కెనరా బ్యాంక్ సిబ్బంది తంగేడుమల్లి శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 27,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 26,570 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 27,153 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.22,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,800 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,737 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

14 నుంచి నాగుల చవితి మహోత్సవాలు



మోపిదేవి: మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి నాగుల చవితి మహోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. దేవస్థానంలో ఆయన ఉత్సవాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. చవితి మహోత్సవాలు 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్తిక మాసం నెల రోజులపాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాగుల చవితి సందర్భంగా 17న తెల్లవారుజాము 2.30 గంటలకు పుట్ట వద్ద పూజలు నిర్వహించి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. 26న సాయంత్రం 6.45 గంటలకు జ్వాలా తోరణం అనంతరం భక్తులకు నాగపుట్ట దర్శనం ఉంటుందని వివరించారు. ఈనెల 14 నుంచి వచ్చేనెల 12 వరకు రోజూ ఉదయం ఆరు గంటలకు గర్భాలయంలో కార్తిక మాస దీక్ష అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. డిసెంబర్ 11న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లోకకల్యాణార్థం లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా జరుగుతుందని వివరించారు.

సుస్థిర సురక్ష

సత్తువ లేని ఒంట్లో జవసత్వాలు నింపేలా.. మూతలు పడే కన్నులు మెరుపల్లె మెరిసేలా.. కదలిక లేని కండరాలన్నీ శక్తికూడదీసుకుని దిగ్గున లేచేలా.. చేవ లేని చేతులు పిడికిలెత్తి జైకొట్టేలా.. అడుగుతీసి అడుగు వేయలేని పాదాలు ఆనంద నర్తనం చేసేలా.. ''జగనన్న ఆరోగ్య సురక్ష'' ఉజ్వల గీతికై మార్మోగుతోంది. లోక కల్యాణం కోసం చేపట్టిన మహాయజ్ఞమై.. రగిలే అగ్నిహోత్రమై.. సర్వేజనా సుఖీభవ అంటూ నినదిస్తోంది. సుస్థిర ప్రగతి వేదికై.. వైద్య వేడుకై విజయనాదం చేస్తోంది. పేదల గళాల్లో హర్షధ్వానమై.. చైతన్యఝరియై.. ఎలుగెత్తుతోంది.

- దిగ్విజయంగా జగనన్న ఆరోగ్య సురక్ష
- దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు
- పైసా ఖర్చులేకుండా ఖరీదైన వైద్యపరీక్షలు
- ఉచితంగా నాణ్యమైన మందుల పంపిణీ
- పేదవర్గాల్లో హర్షాతిరేకాలు



తెనాలిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: సుస్థిర ప్రగతి లక్ష్యాల్లో అత్యంత కీలకమైనది ప్రజారోగ్యం. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సుస్తి చేస్తే వైద్యం చేయించుకోలేని పేదల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యపరీక్షలు చేయడమే కాకుండా ఉచితంగా మందులు అందిస్తోంది. ఫలితంగా పేదవర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నెలరోజులుగా మహాయజ్ఞం

జగనన్న ఆరోగ్య సురక్ష నెల రోజులుగా మహాయజ్ఞంలా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 19,60,698 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీర్ఘకాలిక, జీవనశైలి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ శిబిరాలు వరంలా మారాయి. బీపీ, షుగర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించడం సాధ్యమవుతోంది. ఇప్పటివరకు అంతర్గతంగా ఉన్న పలు తీవ్ర వ్యాధులూ బయటపడుతున్నాయి. ఫలితంగా తక్షణం ఆత్యాధునిక వైద్యం అందించే వెసులుబాటు లభిస్తోంది.

ముందే గుర్తిస్తే బహుళ ప్రయోజనాలు

మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ వ్యాధులకు సకాలంలో మందులు వాడకపోతే అవయవాలు దెబ్బతింటాయి. కిడ్నీలు దెబ్బతినడం, హార్ట్ ఫెయిల్యూర్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రాణాంతక పరిస్థితులు తలెత్తే ఆస్కారం ఉంది. ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్క్రీనింగ్ పరీక్షల ద్వారా వీటిని ముందుగా గుర్తించి మందులు అందిస్తున్నారు. ఈ రోగాలు ఉన్నట్టూ తెలియని ప్రజలకు వాటివల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరాలు నిర్వహణ ఇలా..	
పట్టణప్రాంతాల్లో శిబిరాలు	: 208
గ్రామీణ ప్రాంతాల్లో	: 211
సాధారణ ఓపీ సేవలు	: 1,46,140
మొత్తం పరీక్షలు	: 19,60,698
నేత్ర పరీక్షలు	: 39,978
షుగర్	: 5,41,123
బీపీ	: 6,57,032
వివిధ పరీక్షలు	: 7,62,543
సర్వే చేసిన ఇళ్లు	: 6,28,818
ఇంటింటా స్క్రీనింగ్ టెస్టులు	: 15,75,032

షుగర్‌కు మందులిచ్చారు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. షుగర్‌కు మందులు ఇచ్చారు. గతంలో షుగర్ పరీక్షలు చేయించుకోవాలంటే రూ.200 వరకు అయ్యేవి. ఇప్పుడు ఉచితంగా చేస్తున్నారు. మాలాంటి వారికి ఈ పథకం వరం.

– అర్ల చెన్నమ్మ, కాజ, మంగళగిరి మండలం

మాలాంటోళ్లకు వరం



జగనన్న ఆరోగ్య సురక్ష బృహత్తర కార్యక్రమం. శిబిరాలు ఏర్పాటు చేసి ఖరీదైన వైద్య పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయం. ఇది మాలాంటి పేదలకు వరమే. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కె.వెంకటయ్య, కాజ, మంగళగిరి మండలం

మహత్తర కార్యక్రమం



జగనన్న ఆరోగ్య సురక్ష మహత్తర కార్యక్రమం. జిల్లాలో ఉచిత వైద్యశిబిరాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటి వల్ల వ్యాధులను ముందుగా గుర్తించి తగిన చికిత్స తీసుకునే వెసులుబాటు కలుగుతోంది. శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వారికి డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశాం. దీనికోసం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ, గుంటూరు జిల్లా

స్క్రీనింగ్ పరీక్షలు శుభ పరిణామం



అందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం చాలా మంచిది. దీని వల్ల దీర్ఘకాలిక వ్యాధులను కట్టడి చేయవచ్చు. ముఖ్యంగా షుగర్, బీపీలను గుర్తించి తగిన చికిత్స ద్వారా అదుపులో ఉంచుకోవచ్చు. ఆరోగ్య సురక్ష అద్భుత కార్యక్రమం. పేదలకు ఇది వరంలాంటిది.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

పెద్ద డాక్టర్లు వచ్చారు



గతంలో ఆరోగ్యం బాగోకుంటే కూలినాలి మాని రెండుమూడు రోజులు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఇంటి దగ్గర బడి వద్దకే పెద్ద డాక్టర్లు వచ్చారు. ఖరీదైన పరీక్షలు ఉచితంగా చేశారు. మందులూ ఇచ్చారు. ఈ కార్యక్రమం బాగుంది. జగన్ బాబుకు ధన్యవాదాలు.

ఆర్ధల నాగమ్మ, కాజ, మంగళగిరి మండలం

ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



వెంకటేశ్వర్లు కుటుంబానికి నగదు అందిస్తున్న కమిషనర్

నగరంపాలెం: విధి నిర్వహణలో అసువులు బాసిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. నగరంపాలెంలోని సెంట్రల్ జీఎస్టీ శాఖలో హెడ్ హవాల్దార్‌గా పని చేస్తున్న సీహెచ్.వెంకటేశ్వర్లు కొద్ది రోజుల కిందట గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈ క్రమంలో కమిషనర్ సాధు నరసింహారెడ్డి, సిబ్బంది కలసి రూ.2.06 లక్షల ఆర్థిక సాయాన్ని వెంకటేశ్వర్లు కుమార్తెలు నాగవర్ధిని, కరుణలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించే వెంకటేశ్వర్లు పలు అవార్డుల్ని తీసుకుంటున్నట్లు చెప్పారు. శాఖాపరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల స్థాయిలతో నిమిత్తం లేకుండా, ఎవరికి ఏ ఆపద వచ్చిన సమష్టిగా సహకారం అందిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. తాము అన్నివేళల్లో సహకారం అందిస్తామని వారికి భరోసా కల్పించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన కమిషనర్‌కు, కార్యాలయ అధికార, సిబ్బందికి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రామకృష్ణరాజుయాదవ్, సహాయ కమిషనర్ రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, నవీన్, ఈశ్వరరావు, కాకర్ల శ్రీను పాల్గొన్నారు.

బాణసంచా.. బీ కేర్‌ఫుల్

- ముందు జాగ్రత్తలు అవసరం
- తాత్కాలిక షాపులు కేటాయింపు ప్రక్రియ ప్రారంభం
- ఇప్పటికే జిల్లాలో 187 షాపుల కేటాయింపు
- ఏర్పాట్లలో వ్యాపారులు బిజీ





గుంటూరు డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దీపావళి పండుగ మరో మూడు రోజుల్లో ఉండటంతో బాణసంచా విక్రయాలకు రంగం సిద్ధమవుతోంది. తాత్కాలిక షాపుల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 187 షాపులకు అగ్నిమాపక శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. గుంటూరు నగరంలో డాన్‌బాస్కో స్కూల్‌లో 15 షాపులు, విజ్ఞాన మందిరంలో రెండు, ఇతర చోట్ల నాలుగు, గుంటగ్రౌండ్స్‌లో 23 షాపులకు అనుమతిచ్చారు. పొన్నూరు పట్టణంలో భావన్నారాయణ గుడి వద్ద ఎనిమిది షాపులు, రూరల్‌లో రెండు షాపులు, మంగళగిరి న్యూ బ్యాంక్ కాలనీ గ్రౌండ్, తాడేపల్లి గుడ్‌న్యూస్ హైస్కూల్, ఉండవల్లిలో కలిపి 40 వరకూ షాపులకు అనుమతులు ఇచ్చారు. తెనాలి పట్టణంలోని తాలూకా సెంటర్‌లో 36, పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆరు, గ్రామీణ ప్రాంతంలో 41 కలిపి జిల్లా వ్యాప్తంగా 187 షాపులకు బుధవారం సాయంత్రం వరకూ అనుమతులు ఇచ్చారు.

నిబంధనలు కఠినతరం

గత ఏడాది విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలలో అగ్ని ప్రమాదం జరిగి ఇద్దరు మృత్యువాత పడటంతో ఈ ఏడాది అధికారులు నిబంధనలు కఠినతరం చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా ఫైర్ ఆఫీసర్, గ్రామీణ ప్రాంతాలలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తాత్కాలిక అనుమతులు ఇస్తున్నారు. దీనికోసం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించారు. ఇప్పటికే కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జిల్లా అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేశారు. ఎట్టిపరిస్థితుల్లో రోడ్లపై బాణసంచా అమ్మకాలు జరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

వ్యాపారులకు నిర్దేశించిన నిబంధనలు ఇవే..

- షాపులు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే ఏర్పాటు చేయాలి.
- జనావాసాలకు దూరంగా ఉన్న ఒక అంతస్తు మాత్రమే ఉండే భవనాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు.
- దుకాణానికి, దుకాణానికి మధ్య ఖాళీ ఉండాలి.
- అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.
- ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగితే తక్షణం నియంత్రించేలా ఏర్పాట్లు ఉండాలి.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- లైసెన్స్‌డ్ షాపుల నుంచే బాణసంచా కొనాలి.
- అగ్ని ప్రమాదాలు జరగని ప్రదేశంలో వీటిని భద్రపరచాలి.
- బాణసంచా కాల్చే సమయంలో వాటిపై ఉన్న నిబంధనలు చదివి పాటించాలి.
- ఖాళీ ప్రదేశాల్లోనే కాల్చాలి.
- బాణసంచా కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.
- కాటన్ దుస్తులే ధరించాలి.
- కచ్చితంగా చెప్పులు ధరించాలి
- జనావాసాలు, రద్దీ ప్రాంతాలలో పెద్దపెద్ద టపాసులు కాల్చరాదు
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నపిల్లలు బాణసంచా కాల్చాలి.
- కాలని క్రాకర్స్ వద్దకు వెళ్లి దాన్ని చేతులతో పరీక్షించవద్దు.
- బాంబుల వంటి వాటిని చేతితో పట్టుకుని కాల్చవద్దు.
- లూజుగా ఉండే దుస్తులు ధరించరాదు.
- సొంతంగా తయారు చేసిన బాణసంచాను కాల్చే యత్నం చేయవద్దు.

ప్రజలూ జాగ్రత్తలు తీసుకోవాలి

దీపావళి బాణ సంచా కాల్చే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈసారి షాపుల కేటాయింపు విషయంలో కూడా ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. షాపులు పెట్టే ప్రదేశాల్లో అగ్నిమాపక శాఖ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది.

ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

రోగులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- డీఎంఈ డాక్టర్ నరసింహం
- జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

గుంటూరు మెడికల్ : డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం గుంటూరు జీజీహెచ్‌ను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, కాన్పుల వార్డు, 24 గంటల బ్లడ్ బ్యాంక్, అత్యవసర ఆపరేషన్ థియేటర్, ఐసీయూ చాంబర్స్, జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్ని తనిఖీ చేశారు. నూతనంగా మంజూరు చేసిన సీటీ స్కాన్ పరికరం వచ్చేందుకు కొంత సమయం పడుతోందని, ప్రస్తుతం ఉన్న దాని మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని డీఎంఈ తెలిపారు. అత్యవసర ఆపరేషన్ థియేటర్ వద్ద బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. గుండె ఆపరేషన్ల వార్డును పరిశీలించారు. ఆపరేషన్లు చేసుకున్న రోగులతో కాసేపు మాట్లాడారు. రోగుల్ని ఇబ్బందులు పెట్టినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం రూ.60 లక్షలతో నిర్మిస్తున్న గైనకాలజీ వార్డుల్ని పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రం వద్ద ప్రతి రోగిని పరీక్షించి, ఆలస్యం చేయకుండా మందుల్ని ఇచ్చి జాగ్రత్తగా ఇంటికి పంపేలా చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

అమరేశ్వరునికి రూ.1.17 లక్షల ఆదాయం



అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. దేవదాయశాఖ పెదకూరపాడు గ్రూపు ఆలయాల ఈవో సత్యనారాయణరెడ్డి సమక్షంలో దేవాలయంలో ఉన్న 12 హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ 41 రోజుల హుండీల ఆదాయం మొత్తం 10,29,938 రూపాయలు, అలాగే అన్నదాన మండపంలోని హుండీ ద్వారా 87,559 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

గ్రామీణాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ రూపొందించిన బోర్డును ఆవిష్కరిస్తున్న కత్తెర హెనీక్రిస్టినా

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

ఫిరంగిపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతోందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన బోర్డును క్రిస్టినా ఆవిష్కరించారు. వేమవరం, తక్కెళ్లపాడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. అనంతరం క్రిస్టినా మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకే సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు తీర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేసినట్లు వివరించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. మనరాష్ట్రంలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, సర్పంచ్ మేడాబాబు, వై.రమాదేవి, డి.మెల్కియా, వి.వీరయ్య,డి.సురేష్, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నపురెడ్డి, పి.మరియబాబు, ఎం.సుధాకరరెడ్డి, డి.నరేంద్రకుమార్, వై.యల్లారెడ్డి, ఆర్.రంజన్ బాబు, పి.చిన్న, ఎంపీడీవో పి.విలియమ్స్, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్ రావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఏపీ హ్యాపీ

శాసన మండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల, వేదికపై డొక్కా, గిరి

లక్ష్మీపురం: రాష్ట్ర చరిత్రలో మున్నెన్నడూ కనీవినీ ఎరుగని విప్లవాత్మకమైన సంస్కరణలతో, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సుపరిపాలనతో ఏపీ మొత్తం హ్యాపీగా ఉందని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గం క్లస్టర్–3 పరిధిలోని శ్యామలానగర్ జీరో లైన్ 101 సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన బోర్డును ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ కులం మతం ప్రాంతం పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా నేరుగా బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని పేర్కొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన మేలును దృష్టిలో ఉంచుకుని, పేదల జీవితాల బాగుకు కృషి చేసిన జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, ఆశీర్వదించాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రాజకీయంగా ప్రజల అవసరాలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయన్నారు. అలా మారుతున్న ప్రజల ఆలోచనలు ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు మాత్రమే దక్కుతోందని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల ముఖ్యమంత్రి జగన్ పాలనలో జరిగిన మంచి గురించి ప్రజలకు మరోసారి తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. శ్యామలానగర్ సచివాలయం పరిధిలో రూ.13.31 కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్, క్లస్టర్ –3 అధ్యక్షుడు బత్తుల దేవానంద్, డివిజన్ ఇన్‌చార్జి వీరాంజనేయులు, కార్పొరేటర్లు గేదల రమేష్, అడకా పద్మావతి, సాధు రాజేష్, నిమ్మల వెంకటరమణ, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ చీకటి విజయప్రకాష్ గురువారం విధుల్లో చేరారు. తొలుత జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జీ.రాజకుమారిలను మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

12న బాస్కెట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) ది అమరావతి గుంటూరు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి యరగాని శ్రీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఈనెల 17 నుంచి 19 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 94404 88118 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

అద్దంకి రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద నగదు తీసుకుని వారిని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఇనుమనమెల్లూరు గ్రామానికి చెందిన మందా నాగరాజు రైల్వేలో లోక్ పైలెట్‌గా పనిచేస్తుంటానని చెప్పాడు. అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన బండారు నాగరాజు మరో ఇద్దరికి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానాని నమ్మించి వారి నుంచి రూ.8.6 లక్షలు నగదు తీసుకున్నాడు. ఎంత కాలానికి ఉద్యోగాలు ఇప్పించకపోవటంతో మోసపోయానని గమనించిన మందా నాగరాజు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారదర్శక జాబితా తయారీలో బీఎల్‌ఓలదే కీలకపాత్ర

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, వేదికపై జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు

గుంటూరు వెస్ట్: ఎన్నికలకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, తప్పులు లేకుండా దీనిని రూపొందించడంలో బూత్ లెవల్ ఆఫీసర్ క్షేత్రస్థాయిలో పటిష్టంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన తూర్పు, పశ్చిమ బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల పబ్లిష్ అయిన డ్రాఫ్‌రోల్‌పై ప్రజలు, వివిధ వర్గాల నుంచి అందిన అభ్యంతరాలు, ఫిర్యాదులు, నూతన దరఖాస్తులను బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తమ పరిధిలోని ఓటర్ల జాబితాలపై వారు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి బీఎల్‌ఓ తమ పరిధిలోని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించే క్రమంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాలో అవ్వాలన్నారు. జంక్ నంబర్లు (0 డోర్ నంబరు ఉన్నా, అసలు డోర్ నంబరు లేని, ఊరుపేరు డోర్ నంబరు కలిగి) పూర్తి స్థాయిలో సరిచేశామని, స్పష్టమైన రాతపూర్వక నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే, అనుమతి లేకుండా సెలవు పెట్టే వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన స్పెషల్ క్యాంపునకు హాజరుకాని బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ బీఎల్‌ఓలు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. బీఎల్‌ఓలకు సెలవు మంజూరు చేయాల్సి వస్తే వారి స్థానంలో తప్పకుండా నియామకం జరగాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, అడిషనల్ కమిషనర్ లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్
- పార్టీల ప్రతినిధులతో సమావేశం

నరసరావుపేట: పారదర్శక ఓటరు జాబితా తయారీలో రాజకీయపార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘంన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఈ వారంలో జరిగిన అభివృద్ధి అంతా ప్రతి రాజకీయపార్టీ ప్రతినిధికి అందజేయడం జరిగిందని, వాటిపైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ రెండు, మూడు తేదీలలో జాబితా సవరణ కోసం ప్రత్యేక శిబిరాలను ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లు క్యాంపెయిన్లు నిర్వహిస్తారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాలో ఏవైనా పొరపాట్లు, తప్పిదాలు ముద్రించబడినా, జాబితాలో ఉన్న వారు ఎవరైనా మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా, అనర్హులైన ఓటర్ల వివరాలను సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ల దృష్టికి తీసుకొచ్చి తప్పులు లేని ఖచ్చితమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. డిసెంబర్ 26న క్లెయిములు, ఆక్షేపణలపై విచారణ పూర్తి చేస్తారని, 2024 జనవరి 01న డేటాబేస్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి జనవరి 05న తుది జాబితా విడుదల చేస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్లు మొదటి స్థాయి తనిఖీ పూర్తిచేసిన బెల్ కంపెనీ ఇంజినీర్లకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఎలక్షన్ సెల్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృ మరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చాంబర్‌లో సర్వేలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో మాతృ మరణాలపై సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ సర్వేలెన్స్ సమీక్ష కార్యక్రమం గురువారం జరిగింది. సమీక్షలో జిల్లాలో అక్టోబర్ మాసంలో జరిగిన మాతృమరణాలపై సమీక్షించారు. కాకుమాను మండలం పాండ్రపాడు గ్రామానికి సంబంధించి ఒక మాతృమరణానికి గల కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించి నివారించలేని మరణంగా నిర్ధారించారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు వరకు ప్రతి గర్భిణీని ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారి పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రతీ గర్భిణీ రక్తహీనతకు గురికాకుండా, మధుమేహం, రక్తపోటును కాన్పు అయ్యేంతవరకు సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే మాతృ మరణాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తాడికొండలో 'జగనన్నకు చెబుదాం'

తాడికొండ: నేడు తాడికొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరగనుందని తాడికొండ మండల ఎంపీడీఓ అత్తోట దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హాజరుకానున్నారు. కావున ప్రజలు తమ సమస్యలను నేరుగా అందజేయవచ్చన్నారు. మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌ఓలు తమ తమ శాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, సైన్స్ ఆఫీసర్ ఏ.మధుకుమార్ గురువారం తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 120 ప్రాజెక్టులు పోటీకి రానున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది 'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవటం' ప్రధానాంశంగా ప్రాజెక్టులు రూపకల్పన చేయాల్సి ఉంటుందన్నారు. దీనితోపాటు ఉప అంశాలుగా ఆరోగ్యం పోషణ, శ్రేయస్సును పెంపొందించటం, మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవాలి, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, పర్యావరణ వ్యవస్థ ఆధారిత జీవన విధానం, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలు వంటి ప్రాజెక్టులు రూపొందించవచ్చని వివరించారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ
- జిల్లాస్థాయిలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డీవైఈఓ వెంకటేశ్వరరావు, ఖాసిం, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: భావి శాస్త్రవేత్తలుగా రాణించాలనే లక్ష్యం కలిగిన విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 100 ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలతో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. డీఈఓ శైలజ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో, మేథస్సుకు పదునుపెట్టే వినూత్నమైన ఆలోచనలు చేయాలని సూచించారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న గాలి, జల కాలుష్యాలకు పరిష్కారం చూపే విధంగా వినూత్నమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని అన్నారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో "ఆరోగ్యం కోసం అవరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం" అనేది ప్రధానాంశంగా ఆవిష్కరణలు జరగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న విద్యార్థులు న్యాయనిర్ణేతల ఎదుట తాము రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను వివరించారు. ఈసందర్భంగా ఏడు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

ఎస్.యశ్వంత్, జెడ్పీ హైస్కూల్ (నిడమర్రు), కె.ఆర్నవ్, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ (గుంటూరు), ఎం.శ్రీకాంత్, జెడ్పీ హైస్కూల్ (కంతేరు), ఎ.శ్రీహర్ష, సెయింట్ లారెల్స్ స్కూల్ (గుంటూరు), షేక్ నాగూర్ బీ, జెడ్పీ హైస్కూల్ (ముట్లూరు), స్వర్ణ దీక్ష, జెడ్పీ హైస్కూల్ (యనమదల), నాగ శ్యామల, జెడ్పీ హైస్కూల్ (కొప్పురావూరు) ఉన్నారు. ఈసందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అప్‌కాస్ట్ సమన్వయకర్త గౌసుల్ మీరా, అకడమిక్ సమన్వయకర్త అప్పారావు, గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, డీసీఈబీ కార్యదర్శి లలిత ప్రసాద్, రీసోర్స్ పర్సన్లు డి.శివశంకరరావు, రాజశేఖర్, రాజబాబు, సీతారామయ్య, శాంతి ప్రియ, టి. శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, బాబూరావు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు

- చేబ్రోలులో 97 మి.మీ వర్షం
- సగటున 25 మి.మీ వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 97 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1.8 మి.మీ వర్షం పడింది. సగటున 25 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... మంగళగిరి మండలంలో 61.8 మి.మీ., తాడికొండ 39.4, వట్టిచెరుకూరు 38.2, మేడికొండూరు 28.4, తెనాలి 27.4, పెదకాకాని 26.2, తాడేపల్లి 21.4, ప్రత్తిపాడు 20.2, తుళ్లూరు 18.2, కాకుమాను 16.8, కొల్లిపర 15.6, గుంటూరు పశ్చిమ 15, పెదనందిపాడు 8.6, పొన్నూరు 5, దుగ్గిరాల 4.8, గుంటూరు తూర్పులో 4 మి.మీ చొప్పున వర్షం పడింది. నవంబరు మాసంలో 9వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 22.9 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 42.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

పాఠశాల యాజమాన్యంపై కమిషన్ ఆగ్రహం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు విద్యార్థినుల గోడు
- పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి


ఫిర్యాదులు చూపుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

పర్చూరు (చినగంజాం): స్కూలులో తమను వేధిస్తున్నారని, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థినులు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు వాపోయారు. పాఠశాలకు వచ్చేటప్పుడు కొందరు ఆకతాయిల ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి గురువారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం కారు ఎక్కబోతున్న పద్మావతి వద్దకు విద్యార్థినులు ఏడ్చుకుంటూ వెళ్లారు. పాఠశాలలో జరుగుతున్న ఇబ్బందులు గురించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. బయాలజీ టీచర్ తమను విపరీతంగా కొడుతుందని మోకాళ్ల మీద నిలబెడుతుందని తెలిపారు. పాఠశాలకు వచ్చేటప్పుడు కొందరు ఆకతాయిలు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని వాపోయారు. అంతటితో కారు దిగి వచ్చిన పద్మావతి స్కూల్ అసిస్టెంట్ ఫాదర్ భాను దేవిడ్‌ను పిలిచి వివరణ అడిగారు. అతడిచ్చిన వివరణతో సంతృప్తి చెందక స్థానిక ఎంఈవో సత్యనారాయణ, సీడీపీఓ సుభద్రతో కలిసి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు, విద్యార్థులను హింసించడం మానుకోవాలని ఉపాధ్యాయులకు హితవు చెప్పారు. పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటశాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర మొత్తం అన్ని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. విద్యార్థుల హక్కులకు భంగం కలిగినప్పుడు 1098 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి, గ్రామ కార్యదర్శి ఈఎం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుజ్జనగుండ్లలో వ్యక్తి హత్య


ఘటనా స్థలంలో ఆదినారాయణ మృతదేహం

గుంటూరు ఈస్ట్: హత్యకేసులో నిందితుడు హత్యకు గురైన ఘటన గుజ్జనగుండ్లలో కలకలం రేపింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్ల 4వలైనులో నివాసం ఉండే ఎం.ఆదినారాయణ అలియాస్ వాసు (43) భార్యతో విడిపోయి ఒంటరిగా నివశిస్తున్నాడు. మద్యానికి బానిసైన వాసు పలు కేసుల్లో నిందితుడు. ఒక హత్య కేసులో నిందితుడు. ఆదినారాయణ బుధవారం రాత్రి తన ఇంట్లో మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. ఉదయం ఒంటినిండా గాయాలతో విగతజీవిగా పడి ఉండటం స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆదినారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. నిందితులు నాపరాయితో ఆదినారాయణపై దాడిచేసి హత్య చేసినట్లు గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

కుమారుడికి తీవ్ర గాయాలు


మృతిచెందిన తుమ్మలూరి నెహేమియా

దాచేపల్లి : బతుకుదెరువు కోసం వాహనంలో వెళుతున్న తండ్రి మృత్యువాత పడగా కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల గ్రామ పరిధిలోని రవాణ శాఖ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో బాపట్ల జిల్లా అద్దంకి మండలం గోవాడకి చెందిన తుమ్మలూరి నెహేమియా(57) మృతిచెందగా కుమారుడు తుమ్మలూరి సిసింద్రీ(25) తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ సంధ్యారాణి కథనం ప్రకారం వివరాలు ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కరివేపాకు అమ్ముకునేందుకు వాహనంలో నెహేమియా, సిసింద్రీ వెళుతున్నారు. వాహనం నెహేమియా నడుపుతున్నాడు. చెక్‌పోస్ట్ సమీపంలో నిలిచిన ఉన్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న నెహేమియా అక్కడికక్కడే మృతిచెందగా కుమారుడు సిసింద్రీ తీవ్రంగా గాయపడ్డాడు. చెక్‌పోస్ట్ సిబ్బందితోపాటు అక్కడ ఉన్న వాహనాల డ్రైవర్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సంధ్యారాణి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్రంగా గాయపడిన సిసింద్రీని కూడా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంధ్యారాణి చెప్పారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

బాపట్లటౌన్: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ సమాజం, పోలీసులు, చట్టాల మీద విద్యార్థులకు అవగాహన పెంపొందించడానికి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులతోపాటు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి కూడా వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వేటపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎస్.గంగా వసంతి, ద్వితీయ బహుమతి కొల్లూరు డి.జె.జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కె.ప్రేమ కీర్తన, తృతీయ బహుమతి బాపట్ల పట్టణంలోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కె.శ్రీవల్లిలకు అందజేశారు. పోలీస్‌శాఖలో ఇంకొల్లు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.జ్యోతిష్, పర్చూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.శరత్‌బాబు, కారంచేడు పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగతులసిలకు బహుమతులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ఇ.నారాయణ, వెల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

నలుగురికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందుభాగం

యద్దనపూడి: ముందు వెళ్తున్న లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే...చెన్నై నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు నెల్లూరు నుంచి రాజమండ్రికి కలప లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. యద్దనపూడి గ్రామంలోని ఎర్రకొండ వద్ద అండర్‌పాస్ వంతెన ఎక్కుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఉదయం సుమారు 7 గంటల సమయంలో జరిగిన ఊహించని ఈ ఘటనకు బస్సులోని ప్రయాణికులతోపాటు స్థానికులు ఉలిక్కిపడ్డారు. ప్రమాదంలో బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. అదేసమయంలో హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. బస్సులోని ప్రయాణికులందరూ కిందకు దిగి వెనుకగా వస్తున్న పలు బస్సుల్లో ఎక్కి ఘటనా స్థలి నుంచి వెళ్లిపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది గాయాలైన వారికి ప్రాథమిక చికిత్స చేసి చిలకలూరిపేట ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలంలోని వాహనాలను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సులో నిండుగా ప్రయాణికులు ఉండటం, ప్రమాదం జరిగిన తీరు, బస్సు ముందుభాగం ధ్వంసమైన విధానం చూసిన వారంతా పెనుప్రమాదం తప్పిందని అంటున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి సురేష్ తెలిపారు.

జెడ్పీ హైస్కూల్‌లో అధికారుల విచారణ

చీరాలఅర్బన్: అర్ధాంతరంగా తనను పాఠశాల నుంచి, తన కుమారుడికి టీసీ ఇచ్చిన ఫిర్యాదు విషయమై అధికారులు పాఠశాలలో విచారణ జరిపారు. చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల ఆయాను తొలగించడంతోపాటు ఆమె కుమారుడికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఆమె స్కూల్ ఎదుట నిరసన చేపట్టిన విషయం విదితమే. ఈ వ్యవహారం మీడియాలో రావడంతో నిజనిజాలు తేల్చేందుకు బాపట్ల డీఈవో రామారావు చీరాల డీవైఈవో శ్రీనివాసరావు, బాపట్ల డీవైఈవో వెంకటేశ్వరరావు, చీరాల ఎంఈవో పి.సుబ్రహ్మణ్యంతో త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేశారు. డీఈవో ఆదేశాల మేరకు గురువారం త్రీమెన్ కమిటీ సభ్యులు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. జరిగిన ఘటనలపై పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులతో వారు వేర్వేరుగా మాట్లాడారు. అలానే హెచ్‌ఎం నుంచి వివరాలను నమోదు చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి తుది నివేదికను డీఈవోకు అందించనున్నారు. నివేదిక ఆధారంగా డీఈవో చర్యలు తీసుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

పల్నాడులో 437.2 మి.మీ వర్షం

నరసరావుపేట: జిల్లాలో గురువారం వరకు 437.2 మి.మీ వర్షం కురిసింది. 9 రోజుల వ్యవధిలో 507.0 మి.మీ సాధారణ వర్షం కురవాల్సి వుండగా 1138.2 మి.మీ వర్షం కురవడం విశేషం.

క్లుప్తంగా

దంత సంరక్షణపై అవగాహన తప్పనిసరి



నిడుముక్కల(తాడికొండ): చిన్నారులకు దంత సంరక్షణపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చిన్న వయసుల్లో దంతాల సమస్యలు ఏర్పడి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ధనశ్రీ, డాక్టర్ నిర్మలాదేవి అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా తాడికొండ మండలం నిడుముక్కల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్మైలీ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యురాలు డాక్టర్ వల్లీ ఆధ్వర్యంలో 196 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స అందించి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశీర్వాదానికి ఘన నివాళులు

తాడేపల్లిరూరల్: సీపీఎం నాయకుడు చొక్కా ఆశీర్వాదం వర్ధంతిని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ప్రాతూరులో సీపీఎం కార్యాలయం వద్ద గురువారం ఆశీర్వాదం చిత్రపటానికి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశానికి పెనుముప్పుగా మారిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా, గ్రామ అభివృద్ధి కోసం ఆశీర్వాదం చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రాతూరు గ్రామం కార్పొరేషన్ పరిధిలోని ఉందని ఉపాధి హామీని తీసివేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తుల సంసోను, నాయకులు అమ్మిశెట్టి రామారావు, డోకిపర్తి కోటయ్య, బుర్రరాజు, రవి, శివయ్య, డోకిపర్తి దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం ఇన్‌చార్జి ఎంపీడీఓగా విలియమ్స్



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా పీజే విలియమ్స్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డి.అనూరాధ ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో ఆమె స్థానంలో మంగళగిరి ఎంపీడీఓగా పనిచేస్తున్న పీజే.విలియమ్స్‌కు ఫిరంగిపురం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పలువురు సిబ్బంది, మండల నాయకులు ఆయనను అభినందించారు.

దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: తాడికొండలో సీజనల్ వ్యాధులను అరికట్టడంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు కార్యదర్శి పి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ తోకల సరోజినీ తెలిపారు. ఇందులో భాగంగా కాలువల్లో పూడిక తీయించడం, గడ్డిమందు పిచికారీ, ఫాగింగ్ యంత్రంతో వీధుల్లో పొగ వేయించే పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు వారు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ బి.కోటేశ్వరరావు చెప్పారు. నగరంలో గతనెల 28 నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు గురువారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ రోడ్డుపైకి ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలతో రావాలని చెప్పారు. నంబర్ ప్లేట్ లేకపోయినా, ట్రిపుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ ఎస్‌ఐలు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగనన్నను గెలిపిస్తాయి

- జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా
- పలుచోట్ల వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- సచివాలయాలలో సంక్షేమ పథకాల బోర్డులు ప్రదర్శన



మేడికొండూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

మేడికొండూరు: రాష్ట్రంలో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపిస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మేడికొండూరులో మళ్లీ ముఖ్యమంత్రి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమంలో గురువారం పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు వంద శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లి జగన్ననే ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, జేసీఎస్ కన్వీనర్ షేక్ అబ్బాస్, సొసైటీ అధ్యక్షుడు జయరావ్, గాలీబ్, జి.వి.సుబ్బారెడ్డి, సాంబశివరావు, గౌస్, రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, గోపి, ఉడతా ప్రభాకర్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి



మాట్లాడుతున్న దుగ్గిరాల ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి

తాడేపల్లిరూరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో గురువారం ఏపీకి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్య ద్వారా పేదల కుటుంబాల్లో మార్పులు వస్తాయని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, ఇల్లు మంజూరు కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగాల్సి వచ్చేదని, చివరకు వారి బంధువులకో వారి పార్టీ వారికో అందజేసేవారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అలాంటి పరిస్థితి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.మల్లేశ్వరి, ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, గ్రామ ఉప సర్పంచ్ దొడ్డక రాజేశ్వరి, నాయకులు నల్లనూకల కోటియాదవ్, జమ్ముల లోకేష్, నెరదల వెంకటేశ్వరరావు, నూతక్కి కోటేశ్వరరావు, కంభంపాటి క్రాంతికుమార్, పిల్లి ధర్మతన్నం, షేక్ జానీబాషా, ఉప్పాల సుబ్బారావు, కాబోతు కర్ణ్యారావు, ఉన్నం రాజేష్, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, జూపూడి జాన్సన్, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, నల్లనూకల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు



తుళ్లూరు సచివాలయంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర

తాడికొండ: వివిధ పథకాల కింద ప్రతి సచివాలయానికి ప్రభుత్వం నుంచి కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం దామరపల్లి, తుళ్లూరు-1 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వారు మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి మళ్లించే కార్యక్రమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశాడని అందుకే దేశంలోనే బెస్ట్ సీఎం జగనన్న అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను నూరుశాతం అమలుచేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది దేశంలోనే ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి అవినీతి పార్టీలను రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ తుళ్లూరు మండల అధ్యక్షులు కొప్పుల శేషగిరిరావు, గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, వివిధ విభాగాల నాయకులు బండి ప్రసాద్, శృంగారపాటి సందీప్, రమణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌లు పాల్గొని సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించి ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు, మాదాసు రత్నకుమారి, బాకి వెంకటస్వామి, షేక్ బాజీ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకుసాగండి



ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభాసాయిబాబు, సభ్యులచే ప్రమాణం చేయిస్తున్న ఈవో తిమ్మానాయుడు

- ఆలయ పవిత్రతను కాపాడండి
- ఎమ్మెల్యే శివకుమార్ సూచన
- ప్రమాణస్వీకారం చేసిన వైకుంఠపురం దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు

తెనాలి: సామాజిక సమతౌల్యం పాటిస్తూ నియమించిన వైకుంఠపురం ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు భక్తుల మనోభావాల కనుగుణంగా ఆలయ పవిత్రతను కాపాడుతూ, వారికి తగిన వసతుల కల్పనకు కృషిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం గురువారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. సభకు ఎమ్మెల్యే శివకుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు, ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్‌గా కుంభం సాయిబాబు, సభ్యులుగా కనికిచర్ల చరణ రత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత, బొద్దులూరి సరస్వతి, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్‌చే ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వెంకటేశ్వరుడికి సేవలతోపాటు భక్తుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని సభ్యులను కోరారు.

ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు మాట్లాడుతూ ఆలయ వ్యవస్థాపకుడు బాల నరసింహారావుగౌడ్ 1972లో ప్రతిష్ఠించిన ఆలయానికి, ఎమ్మెల్యే శివకుమార్ చొరవతో ఇంతకాలానికి గౌడ సంఘీయుడైన తనకు చైర్మన్‌గా అవకాశం లభించిందన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి భక్తుడిగా తనకు లభించిన అదృష్టాన్ని బాధ్యతలా భావించి ఆలయన అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. సభ్యులు బట్టు దుర్గారావు, ముంతా దుర్గాప్రసాద్, కురగంటి సునీత, దేవరకొండ వెంకటరమణలు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ వార్డు ఇన్‌ఛార్జి కాళిదాసు సత్యం, అద్దంకి వేణుగోపాల్ మాట్లాడారు. పోతావఝుల పురుషోత్తమశర్మ స్వాగతం పలికిన సభలో వైఎస్సార్ సీపీ పట్టణ-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే చిరంజీవి, బట్టు నాగేశ్వరరావు, దేవరకొండ శంకర్, లక్కరాజు లక్ష్మణరావు, గొట్టిముక్కల కాశీ, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, కొలకలూరి నాగేశ్వరరావు, అక్కిదాసు కిరణ్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలిరూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులందరికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని దానిని సద్వినియోగ పరచుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో పారాలీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ, జాతి, మత, కుల, వర్గ, వర్ణ, లింగ బేధాలు లేకుండా అందరికి సమాంతర న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో సేవ చట్టాన్ని 1987వ సంవత్సరంలో ప్రవేశ పెట్టారని తెలిపారు. కొన్ని ముఖ్య సవరణలు చేసుకుని 1995 నవంబరు 9వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా చట్టం అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జాతీయ న్యాయ సేవా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. న్యాయమూర్తులు పి.రాజశేఖర్, జె. శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, న్యాయస్థానాల సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, సరళ. విజయ్, పాల్గొన్నారు.

రైలు ప్రయాణాల్లో జాగ్రత్తలపై అవగాహన

తెనాలిరూరల్: రైలు ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైల్వే అధికారులు విద్యార్థులకు వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తెనాలి వివేకానంద సెంట్రల్ స్కూలు విద్యార్థులు గురువారం తెనాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. రైల్వే అధికారులు పనితీరు, రైళ్ల రాకపోకల సందర్భంలో అధికారులు తీసుకునే చర్యలు వంటివి పరిశీలించారు. ప్రయాణాలు చేసేప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో అధికారులు చిన్నారులకు వివరించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రావడంతో విద్యార్థులను రైల్లోకి ఎక్కించి చూపించారు. రైళ్లలో బాణాసంచా ఇతర పేలుడు పదార్థాలు తీసుకెళ్లకూడదని, పట్టుబడితే జైలు శిక్ష తప్పదని విద్యార్థులతో పాటు ప్రయాణికులకు తెలిపారు. ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ ఎం. శివరామకృష్ణయ్య, స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.



జీజీహెచ్ చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

గుంటూరుఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మృతిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. చిలకలూరిపేటకు చెందిన పి.ప్రభాకరరావు (52)పై నరసరావుపేట-2టౌన్ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఘటనపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్ నిమిత్తం గుంటూరులోని జిల్లా జైలుకు పంపారు. అక్కడ ప్రభాకరరావు ఈనెల 7న అస్వస్థతకు గురయ్యాడు. జైలు అధికారులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొల్లిపరలో పసుపు సాగుపై శిక్షణ

కొల్లిపర(తెనాలి): జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల శిక్షణలో భాగంగా కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం (శ్రేష్ట ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు పంట సాగుపై శిక్షణ ఏర్పాటుచేశారు. శ్రేష్ట ఎఫ్‌పీసీలో ఉదయం 10 గంటలకు ఆరంభిస్తున్నట్లు డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్‌పీ మాస్టర్ ట్రైనర్లు కె.రామచంద్రన్, కె.సాయిబాబు పాల్గొంటారని తెలిపారు.

మత్తుతో జీవితాలు చిత్తు

నగరంపాలెం: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ స్టేషన్ గుంటూరు-1 సీఐ ఎం. రమేష్ సూచించారు. సెబ్ జిల్లా ఏఎస్పీ డీఎస్.మహేష్ ఆదేశాల మేరకు గురువారం నాజ్ కూడలిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ రమేష్ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తాయని చెప్పారు. తద్వారా కుటుంబాలు ఆర్థిక పరిస్థితులు దారుణంగా మారతాయ తెలిపారు. డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసకావద్దని, తద్వారా తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చవద్దని సూచించారు. డ్రగ్స్ భూతాన్ని ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు.

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ విజయవంతానికి చర్యలు

- నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్
- నేడు నవులూరు 3వ సచివాలయంలో కార్యక్రమం



మాట్లాడుతున్న కమిషనర్ నిర్మల్‌కుమార్, వేదికపై అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలనే) కార్యక్రమాన్ని నగరంలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ అన్నారు. గురువారం కార్పొరేషన్ ఉద్యోగులు, సచివాలయాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఉద్యోగులు, సిబ్బంది అంతా కృషి చేయాలన్నారు. శుక్రవారం నగర పరిధిలోని నవులూరు 3వ సచివాలయం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి సచివాలయంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను పొందుపరచిన బోర్డును తప్పనిసరిగా ప్రజలకు అర్థమయ్యేలా ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయాలలో ప్రజల సమస్యలు దీర్ఘకాలం పెండింగ్ లేకుండా సమయానుకూలంగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారంలో ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేసి నగర అభివృద్ధి తోడ్పడాలన్నారు. నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంతోపాటు మౌలిక వసతుల కల్పన రోడ్ల విస్తరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కార్పొరేషన్, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప వద్దకే వైద్య సేవలు

- వైద్య సేవలు పొందిన వారి సంఖ్య 12,795 మంది
- మందులు పొందిన వారు 12,215 మంది
- వైద్యం పొందిన బాలబాలికలు 580 మంది



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మంగళగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష.. ఆరోగ్య శాఖ చరిత్రలో చారిత్రాత్మక కార్యక్రమంగా నిలుస్తుందని ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గడపగడపకు వెళ్లి తలుపు తట్టి ఆరోగ్య సమాచారాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాలలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ప్రతి ఇంటి వైద్యబృందం వెళ్లి ప్రతి మనిషి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారి వైద్య సేవలందించే లక్ష్యంగా కొనసాగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉద్యమంగా కొనసాగింది. ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం 104 ద్వారా ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు 108 వాహనాలు పరుగులు పెడుతున్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3వేలకు పైగా రోగాలకు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం అందుతుంది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 65 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించగా వాటిలో 12215 మంది పెద్దలు, 580 చిన్నారులు వైద్య సేవలందుకున్నారు. 12215 మంది మందులు తీసుకోగా 4172 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2163 మంది కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, గుండెజబ్బులు తదితర వాటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, కంటి జబ్బులు, దగ్గు, తలనొప్పి తదితర జబ్బులుకు వైద్యం పొందారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పర్యవేక్షక అధికారి అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతమైనట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి జల్లెడ పట్టి రోగులను గుర్తించి వైద్య సేవలందించడం జరిగిందన్నారు.

తెనాలి కోర్టులో విధులు ఆనందదాయకం

- న్యాయమూర్తి జి.మాలతి



న్యాయమూర్తి మాలతిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

తెనాలిరూరల్: తెనాలి కోర్టులో విధులు నిర్వర్తించడం చాలా ఆనందదాయకంగా ఉందని, ఇక్కడి న్యాయవాదులు బెంచ్‌లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని న్యాయమూర్తి జి.మాలతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బదిలీపై హైకోర్టుకు వెళుతున్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు, అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో కేసులు త్వరితగతిన పరిష్కారంలో న్యాయవాదులు అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. అదే విధంగా లోక్ అదాలత్‌లకూ సహకరించి ఎక్కువ కేసులను డిస్పోజల్ చేసేందుకు సహకరించారని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ, న్యాయమూర్తి సేవలను కొనియాడారు. బెంచ్ అండ్ బార్ అనే పదానికి ఒక వివరణాత్మకమైన నిర్వచనాన్ని న్యాయమూర్తి ఇచ్చారన్నారు. అదే విధంగా బార్ అసోసియేషన్‌కు అవసరమైన ఎన్నో విలువైన అనుమతులు ఇప్పించడం, దగ్గరుండి వివిధ కార్యక్రమాలను నిరాటంకంగా జరిపించడంలో న్యాయమూర్తి అందించిన సహాయ సహకారాలు మరిచిపోలేనివని చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కంచర్ల చంద్రశేఖర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నృత్య కళాకారిణులకు సినీ నటుడు సుమన్ సత్కారం



తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన బాల నృత్య కళాకారులు గ్రీష్మ శ్రీ, తహసీన్‌లను సినీ నటుడు సుమన్ ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ నూతన భవన ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన ఆయన వీరి నృత్య ప్రదర్శనను చూశారు. అనంతరం వారిని సన్మానించి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో 'స్మార్ట్ విలేజ్' ఎండీ మృతి

నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా శంకరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్మార్ట్ విలేజ్ ఎండీ ఇందుపూడి సుధాకర్ మృతి చెందాడు. నర్సీపట్నం నుంచి కారులో వెళ్తుండగా అనకాపల్లి శంకరం జాతీయ రహదారి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనకాపల్లికి చెందిన సుధాకర్ స్మార్ట్ విలేజ్ సంస్థలో ఉద్యోగాల పేరుతో ఉత్తరాంధ్రాలోని వేలాది మంది నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో నగదు కాజేశాడన్న ఆరోపణలున్నాయి. ఉద్యోగాల పేరుతో తమను మోసం చేశాడని సుధాకర్‌పై నిరుద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు సుధాకర్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై విడుదలై ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నాడు. ఆయనకు సంబంధించిన ఆస్తులను సీఐడీ అధికారులు సీజ్ చేశారు. ఆయన కొంతకాలంగా నర్సీపట్నంలోనే నివాసం ఉంటున్నాడు.

ఆసక్తికర బోధనతో మెరుగైన ఫలితాలు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యార్థులు పాఠశాలవైపు మొగ్గు చూపాలంటే బోధన ఆసక్తికరంగా ఉండాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రణాళికలు రచిస్తే, మెరుగైన ఫలితాలు వస్తాయని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం విజయవాడలో 'వార్షిక వర్క్ ప్లాన్ అండ్ బడ్జెట్ తయారీ' అంశంపై అన్ని జిల్లాల సెక్టోరియల్ ఆఫీసర్లకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి బడికి వచ్చేలా ఉపాధ్యాయులతో పాటు ఎంఈవోలు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ ఎడ్యుకేషనల్ స్పెషలిస్ట్ గణేశ్ నిగమ్ ఉపాధ్యాయులకు డేటా పరిశోధన, సేకరణ, విశ్లేషణ తద్వారా విద్యా ప్రణాళిక రచన అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో-చైర్మన్, ఆ పార్టీ పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాలపై గురువారం ఆదాయపన్ను (ఐటీ) అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నివాసాలతోపాటు హైదరాబాద్‌లోని నివాసాలు, కార్యాలయాలు, బంధువులు, ఉద్యోగుల ఇళ్లకు చెందిన 30కిపైగా ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటలకే హైదరాబాద్, ఖమ్మంలోని పొంగులేటి నివాసాలకు సీఆర్పీఎఫ్ బలగాలతో కలసి ఐటీ అధికారులు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు సోదాలు కొనసాగాయి.

జనంపై భారం లేదు

- 2025 నాటికి స్మార్ట్ మీటర్లు కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధన
- దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాలు ఈ పనులు చేపట్టాయి
- 'ఆర్‌డీఎస్ఎస్' పథకంతో మీటరుకు రూ.1,350 వరకు గ్రాంటు
- రూ.20వేల కోట్ల భారమంటూ కాకి లెక్కలతో 'ఈనాడు' గగతప్పుడు కథనం


పృథ్వీతేజ్


పద్మజనార్దనరెడ్డి


సంతోషరావు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగుతుంటే ఏపీ మినహా మరెవరూ స్మార్ట్ మీటర్లు అమర్చడం లేదంటూ నిస్సిగ్గుగా అబద్ధాలను అచ్చేస్తోంది ఈనాడు. ప్రభుత్వ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుంటే 'జనం జేబుకు చిల్లు' అంటూ వక్ర భాష్యాలు చెబుతోంది. ఆ కథనంలో దాచిపెట్టిన వాస్తవాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్‌లు) సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు గురువారం 'సాక్షి'కి వెల్లడించారు.

➡ విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ 2025 నాటికి ప్రతి సర్వీసు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు అన్నిటికి స్మార్ట్ మీటర్లను అమర్చాలనే నిబంధన విధించాయి. వినియోగదారులపై ఎటువంటి అదనపు భారం లేకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ పథకాన్ని రూపొందించారు. ఈమేరకు దేశవ్యాప్తంగా డిస్కమ్‌లు చర్యలు చేపట్టాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగానే టెండర్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది.

➡ రాష్ట్రంలో 200 యూనిట్లు అంతకుమించి వాడకం ఉన్న సర్వీసులకు, ప్రభుత్వ సర్వీసులకు డిస్కమ్‌లు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తాయి. తద్వారా పేద, మధ్య తరగతిపై భారం లేకుండా చర్యలు తీసుకున్నాయి. ప్రీపెయిడ్ మీటర్లలో కొత్త టెక్నాలజీ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. బిల్లును ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఒకేసారి కాకుండా అవసరాన్ని బట్టి చెల్లించవచ్చు. విద్యుత్ సరఫరా చేసే సమయం, నాణ్యతను తెలుసుకునే వీలుంది. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టవచ్చు. డబ్బులు కట్టలేదని లైన్‌మెన్ కరెంట్ నిలుపుదల చేసే పరిస్థితి ఉండదు. ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు 2025 మార్చి వరకు గడువు ఉంది. రెండు నెలల వ్యవధిలో ఏర్పాటు చేయాలన్నది అవాస్తవం.

➡ దేశంలో 19.792 కోట్ల మంది వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు ఆమోదం లభించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్, బిహార్, అస్సోం, మణిపూర్, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, త్రిపురలో 7.517 కోట్ల స్మార్ట్ మీటర్లను బిగించేందుకు టెండర్లను ఖరారు చేశారు. బిగించే ప్రక్రియ కొన్ని రాష్ట్రాల్లో కొనసాగుతోంది.

➡ మన రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య భవనాలకు, పారిశ్రామిక వినియోగదారులకు, విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లకు, 11 కేవీ ఫీడర్లకు కలిపి 42 లక్షల స్మార్ట్ మీటర్లను బిగించేందుకు డిస్కమ్‌లు చర్యలు చేపట్టాయి. ఒక్కో సింగిల్ ఫేజ్ మీటర్‌కు నెలకు రూ.86.32, త్రీ-ఫేజ్ మీటర్‌కు రూ.176.02 చొప్పున 93 నెలల వ్యవధిలో టెండర్ దక్కించుకున్న సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, పదేళ్ల పాటు నిర్వహణకు రూ.5 వేల కోట్లు వ్యయం కానుంది. అయితే ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా మీటరుకు రూ.1,350 వరకు కేంద్రం గ్రాంట్ ఇస్తుంది. ఇదంతా వదిలేసి రూ.20 వేల కోట్ల భారమంటూ 'ఈనాడు' కాకి లెక్కలతో తప్పుడు రాతలను అచ్చేసింది.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు మరింత మెరుగైన చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారాల్లో 'విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే'ను క్రమం తప్పకుండా నిర్వహించి.. వివిధ ఆరోగ్య అంశాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా.. వారిని ఆ సమస్యల నుంచి విముక్తులను చేయవచ్చన్నారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ మహిళల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకుని.. వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కౌమార బాలికల్లో రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, పౌష్టికాహార లోపాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టులు పూర్తి చేసేలా ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలివ్వాలని పాఠశాల విద్యా శాఖను సీఎస్ ఆదేశించారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. 'హెల్తీ బేబీ షో' వంటివి నిర్వహించి.. ఉత్తమంగా నిలిచిన గ్రామాలకు అవార్డులివ్వాలని సూచించారు. అంతకుముందు వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, విద్యా శాఖలకు సంబంధించిన నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను.. సాధించిన లక్ష్యాలను సీఎస్ సమీక్షించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు ఎం.టి.కృష్ణబాబు, జి.జయలక్ష్మి, సురేశ్ కుమార్, జె.నివాస్, దివాన్ మైదీన్, భావన, జానకి, ఎం.గిరిజా శంకర్, కె.భాస్కర్ పాల్గొన్నారు.

● తెలంగాణ

దర్శకుడు రాఘవేంద్రరావుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూమి కేటాయింపునకు సంబంధించి సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు సహా పలువురికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను జనవరి మూడో వారానికి వాయిదా వేస్తూ అప్పటిలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తెలుగు సినిమా పరిశ్రమ అప్పటి మద్రాసు నుంచి హైదరాబాద్‌కు వచ్చేటప్పుడు 1984లో బంజారాహిల్స్‌లోని అత్యంత విలువైన భూమిని ఎకరా రూ.8,500 చొప్పున రెండు ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని, దీన్ని పరిశ్రమ అభివృద్ధికి కాకుండా వాణిజ్య కార్యకలాపాలకు వాడుకుంటున్నారని నిర్మాత, దర్శకుడు ఈ.బాలకిషన్ 2012లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అధికారులతో పాటు రాఘవేంద్రరావు, కృష్ణమోహన్‌రావు, చక్రవర్తి, విజయలక్ష్మి, అఖిలానందేశ్వరి, లాలసదేవిలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. దీనిపై గతంలోనే హైకోర్టు నోటీసులు జారీ చేసినా ప్రైవేట్ పార్టీలకు అందలేదు. ఈ పిల్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ముందుకు గురువారం మరోసారి విచారణకు వచ్చింది.

ఇక ప్రత్యేక గుర్తింపుతోనే మొబైల్ నంబర్!

- యూనిక్ ఐడీ నంబర్‌తో జారీ చేసేందుకు కేంద్రం సన్నాహాలు
- ఎన్ని సిమ్‌లు ఉన్నా.. ఒకటే ఐడీ నంబర్
- సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాల కట్టడికి నిర్ణయం

సాక్షి, అమరావతి: సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ప్రతి మొబైల్ ఫోన్ వినియోగదారునికి 'యూనిక్ ఐడీ(ప్రత్యేక గుర్తింపు) నంబర్' కేటాయించాలని నిర్ణయించింది. ఓ వ్యక్తికి ఎన్ని మొబైల్ ఫోన్లు ఉన్నా, ఎన్ని సిమ్ కార్డులు ఉన్నా సరే.. ఐడీ నంబర్ మాత్రం ఒకటే ఉండేలా కార్యాచరణను రూపొందించింది. ఈ ఏడాది చివరినాటికే ఈ ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించింది.

జనాభా కంటే సిమ్‌కార్డులే అధికం..!

మొబైల్ టెక్నాలజీ ప్రజలకు ఎంత సౌలభ్యంగా ఉందో.. సైబర్ నేరస్తులకు అంత ఉపయోగకరంగా మారిందన్నది వాస్తవం. దేశంలో అత్యధిక ప్రాంతాల్లో జనాభా కంటే మొబైల్ ఫోన్లు/సిమ్ కార్డులే అధికంగా ఉండటం గమనార్హం. 2022 డిసెంబర్ నాటికి దేశంలో 114 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు 10.7 కోట్లుండగా.. ప్రైవేటు టెలికాం కంపెనీల కనెక్షన్లు 102 కోట్లకుపైనే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న టెలికాం నిబంధనల మేరకు జమ్మూ-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో మినహా మిగిలిన చోట్ల ఒక వ్యక్తి పేరిట గరిష్ఠంగా 9 సిమ్ కార్డులు ఉండవచ్చు. జమ్మూ-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో గరిష్ఠంగా 6 సిమ్ కార్డులు ఉండవచ్చు. కానీ ప్రైవేటు టెలికాం కంపెనీల ఫ్రాంచైజీలు కొన్ని సిమ్ కార్డుల విక్రయంలో నిబంధనలను పాటించడం లేదు. దీంతో సైబర్ నేరస్తులు వేర్వేరు పేర్లతో ఫోన్ కనెక్షన్లు, సిమ్ కార్డులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. 2022లో భారత్‌లో జరిగిన సైబర్ మోసాలు, వేధింపుల్లో 65 శాతం దొంగ సిమ్‌కార్డులతో చేసినవేనని నేషనల్ సైబర్ సెల్ నివేదిక వెల్లడించింది. వేర్వేరు పేర్లతో సిమ్ కార్డులు తీసుకొని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడటంతో పాటు సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్ పెట్టి మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆ నివేదిక పేర్కొంది. 2022లో దేశంలో నమోదైన మొత్తం నేరాల్లో.. సోషల్ మీడియాకు సంబంధించినవే 12 శాతం ఉండటం గమనార్హం.

14 అంకెలతో యూనిక్ ఐడీ నంబర్..

సోషల్ మీడియా వేధింపులు, ఆన్‌లైన్ మోసాల కట్టడికి దేశంలో మొబైల్ ఫోన్ల కనెక్షన్ల వ్యవస్థను గాడిలో పెట్టాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. టెలికాం శాఖతో కలసి కార్యాచరణను రూపొందించింది. మొబైల్ వినియోగదారులు అందరికీ యూనిక్ ఐడీ నంబర్ కేటాయించాలని నిర్ణయించింది. ఇది 14 అంకెలతో ఉండనుంది. ఓ వ్యక్తి పేరిట ఎన్ని ఫోన్ కనెక్షన్లు ఉన్నా సరే యూనిక్ ఐడీ నంబర్ మాత్రం ఒక్కటే ఉంటుంది. దేశంలో ఎక్కడ సిమ్ కార్డు కొనుగోలు చేసినా.. ఏ ప్రాంతంలో ఫోన్‌ను ఉపయోగిస్తున్నా సరే యూనిక్ ఐడీ నంబర్ మాత్రం అదే ఉంటుంది. వినియోగదారుల ఫోన్‌కు మెసేజ్ పంపించి.. ఓటీపీ ద్వారా నిర్ధారించి.. యూనిక్ ఐడీ నంబర్ కేటాయించాలని కేంద్ర టెలికాం శాఖ భావిస్తోంది. త్వరలో మార్గదర్శకాలు జారీ చేయనుంది.

'అస్త్ర' అప్‌డేట్..

సిమ్‌కార్డు మోసాలను అరికట్టేందుకు ఉద్దేశించిన కేంద్ర టెలికాం శాఖకు చెందిన 'అస్త్ర' సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించనున్నారు. మొబైల్ కనెక్షన్ల కోసం సమర్పించిన గుర్తింపు కార్డులు, ఫొటోలు సక్రమంగా ఉన్నాయో, లేదో గుర్తించడంతోపాటు సంబంధిత దరఖాస్తుదారులకు అప్పటికే యూనిక్ ఐడీ నంబరు కేటాయించారా, లేదా అనే విషయాలను కూడా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పరిశీలించనున్నారు. తద్వారా నకిలీ సిమ్‌కార్డులు, వేర్వేరు పేర్లతో ఉన్న సెల్‌ఫోన్ కనెక్షన్లకు చెక్ పెడతారు. ఈ విధానం ద్వారా ఎక్కడైనా సైబర్ కేసు నమోదవ్వగానే.. నిందితులను సులభంగా గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ సిమ్ కార్డు ఎవరి పేరుతో ఉంది.. యూనిక్ ఐడీ నంబర్‌తో సరిపోలుతోందా, లేదా అనే విషయాలను నిర్ధారించవచ్చని పేర్కొన్నారు.

● తెలంగాణ

ఒకేరోజు 1,260 నామినేషన్లు

- నామినేషన్లు వేసిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారం ముగియనుంది. గురువారం ఏకాదశి సుముహూర్తం కావడంతో భారీసంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చి నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో గురువారం రికార్డు సంఖ్యలో 1,260 నామినేషన్లు దాఖలైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ఉదయం 11 గంటలకు గజ్వేల్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డిలో నామినేషన్లు వేశారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నాటికి రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 1,188 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయం ప్రకటించింది. గురువారం నాటికి దాఖలైన మొత్తం నామినేషన్ల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. రెండురోజుల తర్వాత (13వ తేదీన) నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. 15వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదేరోజు అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉండే అభ్యర్థులెవరో తేలిపోతుంది. నవంబర్ 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

గ్రోమోర్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు



నకరికల్లు: మన గ్రోమోర్ కేంద్రంలో ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రంలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు పుస్తకాలు, అనుమతి పత్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందజేసే ఎరువుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు విక్రయించే ఎరువులు, పురుగుమందులకు బ్యాచ్ నంబర్, సంతకాలతో కూడిన రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. మూడురకాల ఎరువుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సిరిచందన



దొడ్లేరు(క్రోసూరు): మధుమేహం వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన అన్నారు. గురువారం మండలంలోని దొడ్లేరు-1 సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందచేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ మాసం మధుమేహం మాసం సందర్భంగా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మధుమేహం పట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలని కోరారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాఖ్యాంసన్ మాట్లాడుతూ మధుమేహ రోగులు క్రమం తప్పకుండా ప్రతి రోజు కొద్ది సేపు నడక, వ్యాయామం, నియమిత ఆహారం తీసుకుంటూ, వైద్యుల సూచనల మేరకు ఆహార నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది అనుపమ, కోటేశ్వరమ్మ, ఫ్రాంక్లిన్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి కేజీబీవీలో న్యాయ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

సత్తెనపల్లి: విద్యార్థినిలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికర కమిటీ చైర్మన్ డీ నాగ వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ న్యాయ సేవాదినోత్సవం సందర్భంగా పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థినుల కొరకు విద్యాపరమైన చట్టాలు, సామాజిక పరంగా రక్షణ కొరకు అనేక చట్టాలు పటిష్ఠంగా అమలు పరుస్తున్నామన్నారు. ఈ రోజునే న్యాయ సేవా దినోత్సవం జరుపుకోవటానికి గల కారణాలు, వివిధ చట్టాల గురించి వివరించారు. అనంతరం న్యాయమూర్తి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటశాలను ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేశారు. అటెండెన్స్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలిషైద్, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, పారా లీగల్ వలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ


పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష చేస్తున్న డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవికుమార్

సత్తెనపల్లి: మాతృమరణాలు జరగకుండా వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి గర్భిణిని వీలైనంత త్వరగా ఆరు వారాల నుంచి 12 వారాల్లోపే గుర్తించి నమోదు చేయాలన్నారు. ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను గుర్తించి ట్రాకింగ్ చేయడం వలన మాతృ మరణాలు నివారించవచ్చునన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులను, మాతృత్వ సేవలను మెరుగుపరచాలని, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను గర్భిణులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమ కుమార్, జిల్లా సీహెచ్ఓ హర్షవర్ధన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ యూఎల్ఎస్ కవిత, డాక్టర్ సాయి తేజారెడ్డి, సీహెచ్ఓ వి.సీతారావమ్మ, ఎంపీహెచ్ఈవో పిట్టల శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ మీనాక్షమ్మ, ఎంపీహెచ్ఎస్ సంపూర్ణ, వరలక్ష్మి, సిబ్బంది, గర్భిణులు తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి


ఆధ్యాత్మిక అంశాలపై మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ హిమాలయ గురూజీ

సత్తెనపల్లి: సనాతన ధర్మాన్ని పెంపొందించడం, పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని శాంతి ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకులు, పూజ్య శ్రీశ్రీశ్రీ హిమాలయ గురూజీ అన్నారు. పట్టణంలోని ఫిరోజి రుషీంద్రుల మందిరంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వేద గాయత్రి అమ్మవారి దేవాలయంలో నూతనంగా నిర్మించిన గోపురంపైన కలశ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చక స్వాములు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దేవాలయంలో ఉన్న శాసనం ప్రకారం ఇప్పటికీ నిర్మాణం జరిగి సుమారు 100 సంవత్సరాలు పూర్తి అవుతుంది అని వివరించారు. ఫిరోజీ రుషీంద్రుల చరిత్ర తదితర అంశాలను కమిటీ వారు తెలియచేశారు. హిమాలయ గురూజీ మాట్లాడుతూ ప్రజలు యజ్ఞ యాగాదులు చేయటం, సేవాతత్వం పెంపొందించు కోవాలన్నారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై మాట్లాడారు. అంతేకాకుడా గాయత్రి మంత్రం యొక్క విశిష్టతను తెలియజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మఠాధిపతి పులహరి బానుప్రసాద్, మమత బాయి, మాడిశెట్టి పద్మావతి, జమిలి రాధకృష్ణమూర్తి, పులహరి ఫిరోజి, దివ్వెల శ్రీనివాసరావు, చలపాటి శ్రీనివాసరావు, శిష్యులు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

వెంగళరెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల వెంగళరెడ్డి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి అందుతున్న వైద్య సేవల వివరాలు, మందులు, వైద్య పరీక్షలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఇన్ సర్వీస్ ఎడ్యుకేషన్ మీద ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ విద్యనభ్యసించేందుకు వెళుతున్న డాక్టర్ నాగపద్మజను ప్రత్యేకంగా అభినందించారు. పీజీ విద్యనభ్యసించి మరింత ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, ఏరియా వైద్యశాల డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


ముప్పాళ్ళ శివాలయంలో ప్రత్యేక పూజలో తహసీల్దార్ భవానిశంకర్, డీటీ లక్ష్మీప్రసాదు

ముప్పాళ్ళ: మండల కేంద్రం ముప్పాళ్ళలో వేంచేసియున్న పురాతన శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంభాలకు ఇత్తడి తాపడం ఏర్పాటు చేసిన నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. దేవదాయశాఖ అధికారి బీ శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆర్యవైశ్యసంఘం సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక


ప్రజావేదికలో పీడీ జోసఫ్‌కుమార్, తదితరులు

సత్తెనపల్లి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సత్తెనపల్లి మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. పీడీ జి.జోసఫ్‌కుమార్, డీవీఓ విజయలక్ష్మి, ఏవీఓ విజయకుమారి, అంబుడ్స్‌మెన్ మస్తాన్‌వలి, ఎంపీడీవో సత్యనారయణ, ఏపీడీ వెంకటనారాయణలు హాజరయ్యారు. సత్తెనపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు 1,705 పనులకు గాను రూ.12,63,88,024 ఖర్చు చేశారు. గ్రామాల వారీగా మస్టర్లు, పనులపై సామాజిక తనిఖీ జరిగింది. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై గ్రామాల వారీగా ప్రజావేదికలో వివరించారు. ఎఫ్ఏలు, టీఏలు, సీఓలు 22 మంది నుంచి మొత్తం రూ.71,022 రికవరీ చేయాల్సిందిగా తేల్చారు. సమావేశంలో అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ఎమ్జీ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శిఖర ప్రతిష్టా కుంభాబిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీ వేదమాత పంచముఖ గాయత్రి దేవి అమ్మవారు, శిఖర ప్రతిష్టా కుంభాభిషేకం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ ఫిరోజి రుషీంద్రుల వారి మఠంలో కొలువై ఉన్న శ్రీ వేదమాత పంచముఖ గాయత్రి దేవి అమ్మవారి దేవాలయంలో గురువారం ఉదయం నుంచి గోపూజ, గణపతి పూజ, కుంభాభిషేకం, బలికుంభం, పూర్ణాహుతి ఆశీర్వచనం, వేద పండితులు, వాస్తు పండితులు సమక్షంలో మేళ తాళాలతో పెద్ద ఎత్తున శిఖర ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తీర్థప్రసాద వినియోగం ఆలయ కమిటీ వారు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వేద గాయత్రి దేవి అమ్మవారి భక్తులు, ఫిరోజి రుషీంద్రుల వారి భక్త బృందం, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పర్యవేక్షించారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి

బెల్లంకొండ: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహించనున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని మండల గ్రంథాలయ శాఖాధికారి షేక్ మహ్మద్ అలీ కోరారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 14 నుంచి నిర్వహించనున్న కార్యక్రమాలలో భాగంగా 14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాల ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు, 19న మహిళలకు ఆటల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, ముగింపు వేడుకలు, బహుమతుల ప్రదానం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఏఐటీయుసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా నరసరావుపేట లోని ఏపీ ఎన్జీవో హోమ్ ఆవరణలో ఈ నెల11వ తేదీ ఉదయం 11 గంటలకు ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభమవుతాయని ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అమరావతి బస్టాండ్ ఆటో పాయింట్ వద్ద, గార్లపాడు బస్టాండ్, రెంటపాళ్ళ, పాకాలపాడు ఆటో పాయింట్ల వద్ద గురువారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. మహాసభ ముందుగా నరసరావుపేటలోని ఏంజెల్ టాకీస్ వద్ద నుంచి ఉదయం 10 గంటలకు గొప్ప కార్మిక ప్రదర్శన జరుగుతుందన్నారు.


ఫ్యాషన్





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. నురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి,



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ– ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ–కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి, అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి:
మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పేరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.

● సక్సెస్ స్టోరీ


కిషన్ బగారియా

కిషన్‌ని చూసినప్పుడు చాలామందికి అమెరికన్ ఇన్వెంటర్, ఇంజనీర్ చార్లెస్ కెటరింగ్ ఒకప్పుడు చెప్పిన మాట తప్పకుండా గుర్తుకు వస్తుంది.

'ఇన్వెంటర్ అంటే చదువును మరీ సీరియస్‌గా తీసుకోని వ్యక్తి' అంటాడు చార్లెస్ కెటరింగ్. అతడు నవ్వులాటకు అన్నాడో, సీరియస్‌గా అన్నాడో తెలియదుగానీ అస్సాంకు చెందిన కిషన్ చదువును సీరియస్‌గా తీసుకోలేదు. లక్ష్యాన్ని మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు.

లక్ష్యం ఉన్న చోట క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయి. విజయానికి దారిచూపుతాయి. కిషన్ విషయంలోనూ ఇది నిజమైంది.

ఒకప్పుడు 'కిషన్ బగారియా' అంటే పక్క గ్రామం వాళ్లకు కూడా తెలియదు.

ఇప్పుడు అస్సాం మొత్తం సుపరిచితమైన పేరు....కిషన్ బగారియా.

26 సంవత్సరాల కిషన్ బగారియా సృష్టించిన ఆల్–ఇన్–వన్ యాప్ 'టెక్స్‌.కామ్‌'ను అమెరికాకు చెందిన టెక్ కంపెనీ 'ఆటోమేటిక్ ఇంక్' రూ. 416 కోట్లకు కొనుగోలు చేసింది...

చెఫ్ కాదు టెక్ జీనియస్

అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఎనిమిది, అగ్రసేన్ అకాడమీలో తొమ్మిది, పదో క్లాస్ చదివాడు కిషన్. ఇంటర్నెట్ అతడి ప్రపంచంగా ఉండేది. రోజూ ఏదో ఒక కొత్త విషయం గురించి తెలుసుకోవడమో, నేర్చుకోవడమో చేసేవాడు. పన్నెండు సంవత్సరాల వయసులోనే యాప్స్ తయారీపై ఆసక్తి చూపించడం మొదలు పెట్టాడు. తన వినోదం కోసం చిన్న చిన్న యాప్స్ తయారుచేసేవాడు.

'వీడికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే ప్రపంచంతో పనిలేదు' అని నవ్వుతూ ఇతరులతో చెప్పేవాడు తండ్రి మహేంద్ర బగారియా.

'ఎప్పుడు చూసినా కంప్యూటర్‌లో మునిగిపోయి కనిపిస్తావు. భవిష్యత్‌లో ఓ మంచి ఉద్యోగం చేయాలనే లక్ష్యం లేదా?' అని ఒక సందర్భంలో బంధువు ఒకరు కిషన్‌ను అడిగాడు.

'ఉద్యోగం చేయాలని లేదు. లక్ష్యం మాత్రం ఉంది' అన్నాడు కిషన్.

'ఏమిటి అది?' అని ఆసక్తిగా అడిగాడు బంధువు.

'సొంతంగా కంపెనీ పెట్టాలనేది నా లక్ష్యం' గంభీరంగా అన్నాడు కిషన్.

బంధువుతో పాటు అక్కడ ఉన్న వాళ్లు అందరూ బిగ్గరగా నవ్వారు. అలా నవ్విన వాళ్లందరికీ కిషన్ ఇప్పుడు తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.

మరో సందర్భంలో...

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు ప్రవర్తించకు. పగటికలల



ప్రపంచం నుంచి బయటికి వచ్చేయ్. సొంతంగా కంపెనీ అంటే మాటలనుకున్నావా?' అంటూ ఒకప్పుడు తనకు హైస్కూల్‌లో చదువు చెప్పిన టీచర్ మందలించాడు.

ఇప్పుడు ఆ గురువు గారికి కిషన్ తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.

ఎవరినీ ఎప్పుడూ తక్కువ అంచనా వేయవద్దు!


'డీల్ ఫైనలైజ్ కావడానికి మూడు నెలల సమయం పట్టింది. డీల్ ఓకే అయిన సందర్భంలో తట్టుకోలేని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఇది కలా నిజమా! అనుకుంటూ ఒత్తిడికి గురయ్యాను. ఈ స్థితి నుంచి బయటపడడానికి కాస్త సమయం పట్టింది' అంటాడు కిషన్. 'మరి నెక్స్ట్ ఏమిటి?' అనే ప్రశ్నకు కిషన్ ఇచ్చిన జవాబు... 'టెక్స్‌.కామ్‌పై మరింత పనిచేయాల్సి ఉంది. వర్క్ కంటిన్యూ అవుతుంది'

కిషన్ రూపొందించిన 'ఆల్–ఇన్–వన్' యాప్ ట్విట్టర్, వాట్సప్, ఐ మెసేజ్, సిగ్నల్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్... మొదలైన యాప్‌లను ఒకే డ్యాష్‌బోర్డ్‌లో అందుబాటులోకి తెస్తుంది. యూజర్ కమ్యూనికేషన్ ప్రక్రియను సులభతరం చేసే యాప్ ఇది.

యువర్స్

● సంక్లిష్టమైన డిజిటల్ డేటాను వినసొంపైన సంగీతంగా రూపొందించే అల్గొరిథంను రూపొందించాయి టాంపెర యూనివర్శిటీ (ఫిన్‌లాండ్), ఈస్టర్న్ వాషింగ్టన్ యూనివర్శిటీ పరిశోధక బృందాలు ● కోళ్లు అద్దంలో తమను తాము గుర్తు పడతాయని చెబుతుంది జర్మనీలోని యూనివర్శిటీ ఆఫ్ బాన్ పరిశోధన ● బొద్దుగా, ముద్దుగా ఉండే జంతువుల బొమ్మలను ఎక్కువగా చూస్తే ఏకాగ్రత పెరుగుతుందని చెబుతుంది 'ఎన్విరాన్‌మెంటల్ రిసెర్చ్ అండ్ పబ్లిక్ హెల్త్' ఇంటర్నేషనల్ జనరల్‌లో ప్రచురితమైన పరిశోధన పత్రం.

అవును... ఇది నిజమే!



● టెక్.. టాక్

అడోరిక్ 8 ఇన్ వన్ ఎలక్ట్రానిక్ క్లీనర్



బ్రాండ్: అడోరిక్; డైమెన్షన్స్: 15×5×5 సెం.మీ;
బరువు: 200 గ్రా.; మౌంటింగ్ హార్డ్‌వేర్: క్లీనింగ్ కిట్;
● ఎయిర్‌పాడ్ క్లీనింగ్ కిట్ ● ల్యాప్‌టాప్ క్లీనింగ్ కిట్
● స్క్రీన్ డస్ట్ బ్రష్ ● స్ప్రే బాటిల్

రెడ్‌మీ ప్యాడ్



స్క్రీన్ సైజ్: 10.61 అంగుళాలు
డిస్‌ప్లే: 2000×1200;
మెమొరీ: 128జీబి;
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్;
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్;
వోఎస్: ఆండ్రాయిడ్; స్పెషల్ ఫీచర్: ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్

యూట్యూబ్‌లో ఏఐ పవర్డ్ ఫీచర్స్



యూట్యూబ్ కొత్త జెనరేటివ్ ఏఐ పవర్డ్ ఫీచర్స్‌ను పరీక్షిస్తుంది. టాపిక్స్ ఆధారంగా ఈ ఏఐ ఫీచర్‌లు కామెంట్స్‌ను సమరైజ్ చేయడానికి, క్యాటగిరైజ్ చేయడానికి ఉపకరిస్తాయి. కన్వర్‌సేషనల్ టూల్ మనం చూస్తున్న వీడియోకి సంబంధించిన సందేహాలకు సమాధానం చెబుతుంది. కంటెంట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. ఈ సమయంలో వీడియోప్లేబ్యాక్‌కు అంతరాయం కలగదు. కామెంట్స్ ఆధారంగా వేగంగా, సులభంగా కొత్త కంటెంట్ క్రియేట్ చేయడానికి క్రియేటర్‌లకు కామెంట్ సమరైజ్ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఒక టాపిక్‌కు సంబంధించి వర్గీకరించిన వ్యక్తిగత కామెంట్స్‌ను క్రియేటర్‌లు డిలిట్ చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

గూగుల్ స్కాన్ టెక్ట్స్



జీ బోర్డ్ (ఆండ్రాయిడ్) కోసం గూగుల్ 'స్కాన్ టెక్ట్స్' ఫీచర్‌ని రూపొందించే పనిలో ఉంది. లెన్స్ యాప్ ఇమేజ్‌ల నుంచి టెక్స్ట్ రెకగ్నైజ్ చేసినట్లే ఈ కొత్త ఫీచర్ 'ఆప్టికల్ క్యారెక్టర్ రెకగ్నైజ్'తో ఫోన్ కెమెరాలోని ఫోటోల నుంచి టెక్స్ట్‌ను ఎక్స్‌ట్రాక్ట్ చేస్తుంది. యూజర్‌లు తాము కోరుకున్న చోట పేస్ట్ చేయవచ్చు. గత కొన్ని నెలలుగా గూగుల్ జీ బోర్డ్ కోసం కొత్త ఫీచర్‌లను తీసుకువచ్చింది. అందులో 'రీసైజ్ ఆప్షన్' ఒకటి. కీబోర్డ్ హైట్‌ను అడ్జస్ట్ చేసుకోవడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

● గేమింగ్ : నేడే విడుదల

యుద్ధం పిలిచిన చోట



ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియో గేమ్ కాల్ ఆఫ్ డ్యూటీ: మోడ్రన్ వార్‌ఫేర్ నేడు విడుదల అవుతుంది. గత గేమ్స్‌లాగే ఈ గేమ్‌లోనూ రియలిస్టిక్, మోడ్రన్ సెట్టింగ్‌లు కనువిందు చేస్తాయి. మల్టీ–నేషనల్ స్పెషల్ ఆపరేషన్స్ యూనిట్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక ఆకర్షణ. 'కాల్ ఆఫ్ డ్యూటీ' సిరీస్ గత గేమ్స్‌లో ఉన్న ఫీచర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఫీచర్‌లు కూడా ఉంటాయి.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్ **మోడ్స్:** సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్

మనం ఏ పని చేయాలన్నా కాస్తో కూస్తో ఆలోచించి మరీ చేస్తాం. అలా కాకుండా అప్పటికప్పుడు తోచినట్లు చేసే సందర్భంలో వాడే మాట... ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్.

ఉదా: హీ ఈజ్ రెడీ టు ఫైట్ ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్

వోల్ట్–ఫేస్

నమ్ముకున్న అభిప్రాయం, సిద్ధాంతాలు, ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో అకస్మాత్తుగా మార్పు వచ్చే సందర్భంలో వాడే మాట...వోల్ట్–ఫేస్. *ఉదా: ఇన్ 1986 హీ మేడ్ ఏ వెరీ పబ్లిక్ అండ్ డ్రామటిక్ పొలిటికల్ వోల్ట్–ఫేస్ ఫ్రమ్ లెఫ్ట్ టు రైట్*

● మ్యూజిక్ వరల్డ్

వరం లాంటి స్వరం



'వీరే ది వెడ్డింగ్' సినిమాతో బాలీవుడ్ సింగర్‌గా అరంగేట్రం చేసింది లీసా మిశ్రా. యూనిక్ వాయిస్‌తో ప్రేక్షకులను మెప్పించింది. తనకు ఇష్టమైన పాటలు పాడి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్ట్ చేసే మిశ్రా చికాగోలో డాటా–ఎనలిస్ట్‌గా ఉద్యోగం చేసింది. సంగీతాన్నే కెరీర్ చేసుకోవడానికి అమెరికా నుంచి ముంబై వచ్చింది. రెండు సంవత్సరాల క్రితం ప్రఖ్యాత సింగర్ లేడీ గాగాతో కలిసి మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో మిశ్రాకు ఎనిమిది లక్షల ఫాలోవర్స్ ఉన్నారు. తన యూట్యూబ్ చానల్‌కు మూడు లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'మ్యూజిషియన్‌గా పేరు తెచ్చుకోవడానికి నాకు యూట్యూబ్ ఎంతో ఉపయోగపడింది. నా సంగీతం ప్రపంచ వ్యాప్తంగా చాలామందికి పరిచయం కావడానికి సోషల్ మీడియా ఉపయోగపడింది. కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్పులా, ఒత్తిడిని జయించే శక్తిలా నా సంగీతం ఉండాలనుకుంటాను. చాలామందికి మన విజయం తప్ప ఆ విజయం కోసం గతంలో పడిన కష్టం గురించి తెలియదు. దీంతో వోవర్ నైట్ సక్సెస్ అంటుంటారు' అంటుంది సింగర్–సాంగ్ రైటర్ లీసా మిశ్రా.

సినిమా


● ఎన్టీఆర్

గోవా టు హైదారాబాద్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ విలన్ రోల్ చేస్తున్నారు. ఇటీవల గోవాలో మొదలైన ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తయినట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీ.. ఇలా ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. అలాగే 'దేవర' నెక్స్ట్ షెడ్యూల్ డిసెంబరులో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని తొలి భాగం 'దేవర పార్ట్ 1' ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ఆ కథలు నాకు ధైర్యాన్నిచ్చాయి - సమంత



''నా జీవితంలో విడాకులు, నా సినిమాలు వరుసగా పరాజయం చెందడం.. ఆరోగ్య సమస్యలు (మయోసైటిస్).. ఇలా అన్నీ ఒకేసారి చుట్టుముట్టడంతో ఎంతో కుంగిపోయాను'' అని సమంత అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విధంగా పేర్కొన్నారు. అదే ఇంటర్వ్యూలో సమంత ఇంకా మాట్లాడుతూ– ''జీవితంలో ఎవరికైనా ముఖ్యమైనది వివాహం. నా వైవాహిక జీవితం విఫలమైంది.. ఆరోగ్యం క్షీణించింది. అదే టైమ్‌లో నా సినిమాలూ ప్రేక్షకులను మెప్పించలేదు. ఈ సమస్యలతో సుమారు రెండేళ్లు జీవితంలో ఎంతో కుంగిపోయాను. అప్పుడు బుక్స్ చదవటం మొదలుపెట్టాను. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొని, మళ్లీ సినిమాలు చేసిన నటుల గురించి, జీవితంలో ట్రోలింగ్‌కి, మానసిక ఒత్తిడికి గురైన వారు ఎలా కోలుకున్నారో తెలుసుకున్నాను. వారి కథలు చదవడం నాకెంతో ఉపయోగపడింది. వారిలా నేనూ చేయగలననే ధైర్యం వచ్చింది. ఈ దేశంలో ఎందరో స్టార్స్ ఉన్నారు. అందరిలో నాక్కూడా గుర్తింపు రావడం గొప్ప అదృష్టం. నా లైఫ్‌లోని ఒడిదుడుకులు బహిర్గతమైనందుకు నాకు బాధ లేదు. ఇక్కడ నాలా ఇబ్బందులు పడేవారు ఎందరో ఉన్నారు. వారందరూ నాలాగే పోరాడాలని ఆశిస్తున్నాను'' అన్నారు.

కన్నప్పలో ఎంట్రీ


● మోహన్‌బాబు, శరత్‌కుమార్

సీనియర్ నటులు మంచు మోహన్‌బాబు, శరత్‌కుమార్ 'కన్నప్ప' మూవీ సెట్స్‌లో ఎంట్రీ ఇచ్చారు. మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నటుడు, నిర్మాత మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ ప్రస్తుతం న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. హీరో ప్రభాస్, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటించనున్న విషయం తెలిసిందే. తాజాగా నటుడు మంచు మోహన్‌బాబు, శరత్ కుమార్ 'కన్నప్ప'లో భాగమైనట్లు ప్రకటించి, వారిద్దరూ కలిసి ఉన్న ఫొటోని విడుదల చేశారు. ''శివ భక్తుడు కన్నప్ప జీవిత చరిత్ర చుట్టూ ఈ చిత్రకథ తిరుగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

తొలి ప్రయత్నంలోనే హిట్టవడం ఆనందం - నిర్మాత అల్లు అరవింద్


● అల్లు అరవింద్, వంశీ నందిపాటి

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమాను గీతా ఆర్ట్స్‌కు చెందిన వంశీ నందిపాటి ఈ నెల 3న విడుదల చేశారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా ముందుకు వెళ్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా వంశీ నందిపాటిని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ అభినందించారు. వంశీ మంచి అభిరుచిగలవాడని, మొదటి ప్రయత్నంలో చిరస్మరణీమైన హిట్ అందుకోవడం తనకు ఆనందంగా ఉందని అల్లు అరవింద్ అన్నారు. ఈ సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ యూనిట్ నవంబరు 10 నుంచి ఆంధ్రాలో పర్యటించనుందని కూడా ఆయన వెల్లడించారు.

ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి - అవసరాల శ్రీనివాస్


● అవసరాల, చైత్ర, రుక్మిణి, హేమంత్, అనుదీప్, వివేక్, రక్షిత్ శెట్టి

రక్షిత్ శెట్టి హీరోగా నటించిన కన్నడ చిత్రం 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి'. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్, చైత్ర జె. ఆచార్ హీరోయిన్లుగా నటించారు. ఈ ఏడాది విడుదలైన 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ ఏ' సినిమాకు ఇది సీక్వెల్. 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి' సినిమాను తెలుగులో 'సప్తసాగరాలుదాటి సైడ్ బి'గా టీజీ విశ్వ ప్రసాద్ , వివేక్ కూచిభొట్ల ఈ నెల 17న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశానికి ఓ అతిథిగా హాజరైన అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి. 'సైడ్ ఏ'లో కనిపించని కోణాలు ఏమైనా 'సైడ్ బి'లో కనిపిస్తాయా? అని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''సప్తసాగరాలు దాటి సైడ్ ఏ'కు లభించిన ప్రేక్షకాదరణ 'సైడ్ బి'కి కూడా లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు మరో అతిథి కేవీ అనుదీప్. రక్షిత్‌శెట్టి మాట్లాడుతూ– ''అతడే శ్రీమన్నారాయణ', '777 చార్లీ', 'సప్త సాగరాలు దాటి సైడ్ ఏ' చిత్రాలపై తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ 'సప్త సాగరాలు దాటి సైడ్ బి'కి కూడా లభిస్తాయని ఆశిస్తున్నాను' అన్నారు. ''నా జీవితంలో తారసపడిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'సప్త సాగరాలు దాటి..' సినిమా కథ రాసుకున్నాను'' అన్నారు హేమంత్ రావు. ''సప్తసాగరాలు దాటి: సైడ్ ఏ'కు లభించినట్లే 'సైడ్ బి'కీ ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు వివేక్ కూచిభొట్ల.

అవార్డుల కంటే ప్రేక్షకుల గుర్తింపే ముఖ్యం - దర్శకుడు రాజు మురుగన్



''అవార్డుల కోసం సినిమాలు తీయాలనే ఆలోచన నాకు ఉండదు. ప్రేక్షకులు ఇచ్చే గుర్తింపు, ప్రేమ, అభిమానం, ఆప్యాయత చాలా ముఖ్యం. అవార్డులు వస్తే అదనపు బోనస్‌గా భావిస్తాను. ప్రేక్షకుల ప్రేమ, అభిమానంతో పాటు 'జోకర్' చిత్రానికి జాతీయ అవార్డు తీసుకోవడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. 'జపాన్' కూడా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని దర్శకుడు రాజు మురుగన్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా రాజు మురుగన్ మాట్లాడుతూ– ''నేను సినిమాల్లోకి రావడానికి చార్లీ చాప్లిన్‌గారే స్ఫూర్తి. మూకీ చిత్రాలతోనే ఎన్నో ఆలోచనలు, భావోద్వేగాలను రేకెత్తించారు ఆయన. ఇక కార్తీగారిని దృష్టిలో పెట్టుకునే 'జపాన్' కథ రాశాను. కార్తీ, నిర్మాతలు ప్రభు, ప్రకాశ్‌గార్ల సహకారంతోనే 'జపాన్' చిత్రం ఇంత గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. ఒక దర్శకుడిగా చిన్నా పెద్దా అని కాకుండా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

కథే హీరో - దినేష్ తేజ్



దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించిన లవ్ స్టోరీ ఫిల్మ్ 'అలా నిన్ను చేరి..'. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో దినేష్ తేజ్ మాట్లాడుతూ– ''జీవితంలోని ఓ దశలో ప్రేమ ముఖ్యమా? లక్ష్యం ముఖ్యమా? అంటూ ప్రతి మధ్యతరగతి అబ్బాయి గురయ్యే సంఘర్షణను ఇందులో చూపించాం. ఈ సినిమాలో నేను కొత్తగా కాస్త కమర్షియల్ రోల్‌లో నటించాను. ఓ మంచి సినిమా చూశామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకి వస్తారని చెప్పగలను. కథ ఉంటేనే ఏమైనా చేయగలం. అందుకే కథే హీరో అని నమ్మే వ్యక్తిని నేను. ప్రేక్షకులు మెచ్చుకునే కథల్లో భాగం కావాలనుకుంటాను'' అన్నారు.



నిర్మాత వేణుగోపాల్ మృతి


● వేణుగోపాల్

'నక్షత్రం'(2017) సినిమా నిర్మాతల్లో ఒకరైన ఎస్‌వీఎస్ వేణుగోపాల్(60) బుధవారం రాత్రి మృతిచెందారు. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వెళుతున్న రైలు నుంచి ఆయన ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. సీరియల్స్ నిర్మాతగా ఆయన బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితులే. 'ఆనందో బ్రహ్మ' (1996) సీరియల్‌తో నిర్మాతగా ఆయన ప్రస్థానం మొదలైంది. దాదాపు పది సీరియల్స్ నిర్మించారాయన. 'ప్రియురాలు పిలిచె' ఆయన తీసిన చివరి సీరియల్. 'తులసీదళం' సీరియల్‌కి నంది అవార్డు అందుకున్నారు వేణుగోపాల్. సినిమా నిర్మాతగా 'నక్షత్రం' ఆయన తొలి చిత్రం.. అదే చివరి చిత్రం కూడా. హీరో చిరంజీవి నటించిన తొలి టీవీ షో 'విజయం వైపు పయణం' కి వేణుగోపాల్ నిర్మాత. ఈ షోకి యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించారు. వేణుగోపాల్‌కి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వేణుగోపాల్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా 'నక్షత్రం' సినిమా నిర్మాతల్లో ఒకరైన సజ్జు మాట్లాడుతూ– ''వేణుగోపాల్‌గారు రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నాడన్నది అవాస్తవం. ఆయనకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు'' అన్నారు.

నాలుగేళ్లు పరిశోధన చేశాను - దర్శకుడు ఓంకార్ శ్రీనివాస్



హన్సిక టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. ఓంకార్ శ్రీనివాస్ దర్శకత్వంలో బురుగు రమ్యా ప్రభాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఓంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''కొన్ని సినిమాలకు దర్శకత్వ విభాగంలో చేసిన నాకు 'మై నేమ్ ఈజ్ శృతి' దర్శకుడిగా తొలి చిత్రం. ఓ అమ్మాయి జీవితంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రకథ రాసుకున్నాను. స్కిన్ మాఫియా గురించిన స్క్రీన్‌ప్లే బేస్డ్ ఫిల్మ్ ఇది. హన్సికగారి అమ్మగారు స్కిన్ డాక్టర్ కావడంతో ఈ కథకు హన్సికగారు బాగా కనెక్ట్ అయ్యారు. జీవితంలో ఓ కలను నిజం చేసుకునేందుకు గ్రామం నుంచి సిటీకి వచ్చిన శృతి (హన్సిక పాత్ర పేరు) స్కిన్ మాఫియా ట్రాప్‌లో ఎలా చిక్కుకుంది? ఆ తర్వాత తనను తాను ఏ విధంగా కాపాడుకోగలిగింది? అనేది ఈ చిత్రం కథాంశం. మగవారికంటే మహిళలు చాలా స్ట్రాంగ్‌గా ఉంటారని, పెప్పర్ స్ప్రేలు లేకపోయినా తలలో ఉండే ఓ సేఫ్టీ పిన్‌తో కూడా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోగలరని ఈ సినిమాలో చూపించాం. ఈ సినిమా కోసం నాలుగేళ్లు పరిశోధన చేశాను'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	143	64,832
నిఫ్టీ ▽	48	19,395

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
● నాస్‌డాక్	13,651	△	5
● డోజోన్స్	34,083	▽	29
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,456	△	54
● డాక్స్	15,223	△	71
● షాంఘై	3,053	△	1
● నికాయ్	32,647	△	480

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,830
బంగారం (99.5 స్వచ్ఛత)	56,980
వెండి (కిలో)	70,300

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	100.58	103.20
€	యూరో	ఒకటికి	87.74	90.78
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	54.40	55.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	51.85	56.06
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	59.11	61.34
SAR	సౌదీ రియాల్	ఘరుచేసినకి	22.88	21.35
UAE D	యూఏఈ దిర్హామ్	ఘరుచేసినకి	21.78	23.57
¥	చైనా యువాన్	ఘరుచేసినకి	10.31	12.38

ఇక కెనరా బ్యాంక్ వంతు...

5 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు పెంపు

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ – ఐదు బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. ఇటీవలే ప్రైవేటు రంగ దిగ్గజం- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇదే స్థాయిలో కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ను పెంచిన సంగతి తెలిసిందే. అయితే కెనరా బ్యాంక్ మాత్రం అన్ని కాలపరిమితులపై రుణ రేటును పెంచింది. దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన అన్ని రుణాలపై వడ్డీరేట్లు పెరగనున్నాయి. పెంచిన రేట్లు ఈ నెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. కెనరా బ్యాంక్ తాజా రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం – సాధారణంగా ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలకు ప్రాతిపదికన అయిన ఏడాది ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతం నుంచి 8.75%కి చేరింది. ఓవర్‌నైట్, నెల, మూడు నెలలు, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ రేట్లు కూడా 5 బేసిస్ పాయింట్ల చొప్పున పెరిగాయి.

రిలయన్స్, ఇన్ఫీ, టీసీఎస్ షేర్లు పడేశాయ్



19,400 దిగువకు నిఫ్టీ ● సెన్సెక్స్ నష్టం 143 పాయింట్లు

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 1% పతనంతో సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ మళ్లీ 19,400 పాయింట్ల దిగువకు చేరింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ఇందుకు తోడయ్యాయి. ఇంట్రాడేలో 280 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 143 పాయింట్లు పతనమై 64,832 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి 48 పాయింట్లు నష్టపోయి 19,395 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడినా, వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. తదుపరి కోలుకున్న ప్రతిసారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఇంధన, మెటల్, ఐటీ, టెక్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఫార్మా, ఆటో, రియల్టీ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు 12 రోజూ అమ్మకాలకు పాల్పడుతూ రూ.1,712 కోట్ల విలువైన ఈక్విటీను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,512 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు ట్రేడింగ్‌లో అధిక భాగం నష్టాల్లో ట్రేడైనప్పటికీ.. చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

- సంస్థాగత కొనుగోలుదారుల(క్యూఐబీ) దన్నుతో అస్క్ ఆటోవేటివ్ ఐపీఓ చివరి రోజు నాటికి 51.14 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.06 కోట్ల షేర్లు జారీ చేయగా 105 కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 142.41 రెట్లు, సంస్థాగతేర ఇన్వెస్టర్ల విభాగం 35.47 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 5.70 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- నష్టాల మార్కెట్లోనూ వెల్‌స్పన్ కార్ప్ షేరుకు భారీ డిమాండ్ నెలకొంది. క్యూ2లో నికర అమ్మకాలు 16% పెరగడం ఇందుకు కారణమైంది. బీఎస్‌ఈలో 5% పెరిగి రూ.480 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 9% ర్యాలీ చేసి రూ.496 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో శ్రీ రేణుకా షుగర్స్ షేరు 4% నష్టపోయి రూ.50 వద్ద స్థిరపడింది.

2026 నాటికి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు

ఆర్చర్ ఏవియేషన్, ఇంటర్‌గ్లోబ్ డీల్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2026 నాటికల్లా పూర్తి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. ఇందుకోసం ఆర్చర్ ఏవియేషన్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎయిర్ ట్యాక్సీలతో ఢిల్లీలోని కనాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కి 7 నిమిషాల్లో చేరుకోవచ్చని పేర్కొంది. రోడ్డు మార్గంలో 27 కి.మీ. దూరం ఉండే ఈ ప్రయాణానికి సాధారణంగా 60–90 నిమిషాలు పడుతోందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ ట్యాక్సీలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, ఎమర్జెన్సీ సర్వీసుల కోసం ఎలక్ట్రిక్ విమానాలను వినియోగించే అవకాశాలను కూడా ఇరు సంస్థలు పరిశీలించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ తెలిపింది. ఇండిగో పేరిట ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ విమానయాన సర్వీసులు అందిస్తోంది. ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) విభాగంలో ఆర్చర్ ఏవియేషన్ కార్యకలాపాలు సాగిస్తోంది.



అరబిందో ఫార్మా లాభం రూ. 752 కోట్లు

- ఆదాయం రూ. 7,219 కోట్లు
- రూ. 3 డివిడెండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 752 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన రూ. 409 కోట్లతో పోలిస్తే లాభం దాదాపు 84 శాతం ఎగిసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 5,739 కోట్ల నుంచి 26 శాతం పెరిగి రూ. 7,219 కోట్లకు చేరింది. రెండో త్రైమాసికంలోనూ భారీగా విక్రయాలు నమోదయ్యాయని, వివిధ మార్కెట్లలో పటిష్టమైన పనితీరు సాధించామని కంపెనీ వైస్ చైర్మన్ కె. నిత్యానంద రెడ్డి తెలిపారు. కొత్తగా మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెట్టనుండగా, కీలక ప్రాజెక్టులు తుది దశల్లో ఉన్నాయని ఆయన చెప్పారు. వీటి దన్నుతో భవిష్యత్‌లోను పటిష్టమైన వృద్ధిని సాధించడం కొనసాగించగలమని పేర్కొన్నారు. రెండో త్రైమాసికంలో ఫార్ములేషన్స్ విభాగం ఆదాయం 29 శాతం పెరిగి రూ. 5,968 కోట్లకు చేరింది. అమెరికా మార్కెట్ సుమారు 36 శాతం ఎగిసి రూ. 3,385 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ ఆదాయంలో దీని వాటా 47 శాతంగా ఉంది. సమీక్షాకాలంలో అమెరికాలో అరబిందో ఫార్మా 19 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. యూరప్ మార్కెట్ 17 శాతం పెరిగి రూ. 1,769 కోట్లకు, గ్రోత్ మార్కెట్స్ 25 శాతం పెరిగి రూ. 564 కోట్లకు చేరాయి. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 300 కోట్లు వెచ్చించింది.

బీఎస్‌ఈలో అరబిందో షేరు 1.50 శాతం పెరిగి రూ. 951 వద్ద ముగిసింది.

హెచ్‌ఏఎల్‌తో ఎయిర్‌బస్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా హిందుస్తాన్ ఏరోనాటిక్స్ (హెచ్‌ఏఎల్)తో ఎయిర్‌బస్ జట్టు కట్టింది. కమర్షియల్ విమానాల సర్వీసుల విభాగంలోకి ప్రవేశించేందుకు హెచ్‌ఏఎల్‌కు ఈ ఒప్పందం తోడ్పడనుంది. భారత్‌ను సమగ్ర ఎంఆర్‌వో హబ్‌గా తీర్చిదిద్దాలని తాము లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఎయిర్‌బస్‌తో తమ నాసిక్ విభాగం ఒప్పందం ఇందులో భాగమేనని హెచ్‌ఏఎల్ సీఈవో (ఎంఐజీ కాంప్లెక్స్) సాకేత్ చతుర్వేది తెలిపారు. ఒప్పందంలో భాగంగా ఏ320 రకం విమానాలకు సంబంధించిన టూల్ ప్యాకేజీని ఎయిర్‌బస్ అందిస్తుంది. అలాగే ఎంఆర్‌వో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కన్సల్టింగ్ సర్వీసులు, తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఎయిర్‌బస్ వరల్డ్)కు యాక్సెస్ అందిస్తుంది.

ఈక్విటీ ఫండ్స్‌లోకి భారీ పెట్టుబడులు

- అక్టోబర్‌లో రూ.20,000 కోట్లు రాక
- సిప్ రూపంలో రూ.17 వేల కోట్లు



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అక్టోబర్‌లోనూ ఇన్వెస్టర్ల ఆదరణ చూరగొన్నాయి. నికరంగా రూ.20,000 కోట్లను ఆకర్షించాయి. సెప్టెంబర్‌లో వచ్చిన రూ.14,091 కోట్లతో పోలిస్తే 40 శాతానికి పైగా పెరిగాయి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో నెలవారీగా వచ్చే పెట్టుబడులు రూ.16,928 కోట్ల మైలురాయిని చేరాయి. సిప్ రూపంలో ఒక నెలలో వచ్చిన గరిష్ఠ స్థాయి పెట్టుబడులు ఇవే కావడం గమనించొచ్చు. అక్టోబర్ నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గురువారం విడుదల చేసింది. అక్టోబర్ నెలలో నాలుగు కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాలు నిధుల సమీకరణ కోసం మార్కెట్లోకి రాగా, ఇవి రూ.2,996 కోట్లను సమీకరించాయి.

- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.4,495 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. గత కొన్ని నెలలుగా స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్ పథకాలు పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తుండడం గమనించొచ్చు.
- థీమ్యాటిక్ ఫండ్స్ రూ. 3,896 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి.
- వరుసగా ఐదు నెలల పాటు పెట్టుబడులను కోల్పోయిన లార్జ్‌క్యాప్ పథకాల దశ మారింది. ఇవి నికరంగా రూ.724 కోట్లను రాబట్టాయి.
- డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి నికరంగా రూ.42,634 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్‌లో డెట్ విభాగం నుంచి నికరంగా రూ.లక్ష కోట్లు బయటకు వెళ్లడం గమనార్హం.
- డెట్‌లో లిక్విడ్ ఫండ్స్ రూ.32,694 కోట్లను ఆకర్షించాయి. గిల్ట్ ఫండ్స్‌లోకి రూ.2,000 కోట్లు వచ్చాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లోకి రూ.841 కోట్లు వచ్చాయి.
- అన్ని విభాగాల్లోకి కలిపి అక్టోబర్‌లో రూ.80,528 కోట్లు వచ్చాయి.
- మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) సెప్టెంబర్ చివరికి ఉన్న రూ. 46.58 లక్షల కోట్ల నుంచి రూ. 46.71 లక్షల కోట్లకు పెరిగాయి.

అదానీ పోర్ట్స్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 1,762 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప వృద్ధితో రూ. 1,762 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,738 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,649 కోట్ల నుంచి రూ. 6,952 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,752 కోట్ల నుంచి రూ. 4,477 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 49% ఎగసి రూ. 7,429 కోట్లకు చేరింది. ఈ ఏడాది ప్రథమార్ధం(ఏప్రిల్–సెప్టెంబర్)లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 12,894 కోట్ల ఆదాయం సాధించినట్లు అదానీ పోర్ట్స్ సీఈవో కరణ్ అదానీ తెలిపారు. 203 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో పరిమాణం నమోదైనట్లు వెల్లడించారు. తొలి ఆరు నెలల్లో 8 పోర్టులు రికార్డ్ కార్గో పరిమాణాన్ని సాధించినట్లు వివరించారు. ఈ జాబితాలో ముంద్రాసహా హజీరా, ఎన్నోర్, ధామ్రా, కృష్ణపట్నం, గంగవరం ఉన్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు 1.5% నీరసించి రూ. 806 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం హైస్పీడ్



క్యూ2లో రూ. 561 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం దాదాపు మూడు రెట్లు ఎగసి రూ. 561 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 199 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,266 కోట్ల నుంచి రూ. 9,638 కోట్లకు జంప్ చేసింది. భారీ, మధ్యతరహా వాణిజ్య వాహన దేశీ విక్రయాలు 18 శాతం వృద్ధితో 29,947 యూనిట్లకు చేరాయి. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు మాత్రం 17,040 యూనిట్ల నుంచి 16,998 యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు 1.7% బలహీనపడి రూ. 171 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



భారత జూనియర్ మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ప్రీతి

ఈనెల 29 నుంచి డిసెంబర్ 10 వరకు చిలీలో జరిగే జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హరియాణాకు చెందిన ప్రీతి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశలో భారత్ గ్రూప్ 'సి'లో కెనడాతో నవంబర్ 29న, జర్మనీతో నవంబర్ 30న, బెల్జియంతో డిసెంబర్2న తలపడుతుంది. 2022 జూనియర్ ప్రపవంచకప్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది.

భారత జట్టు: ప్రీతి (కెప్టెన్), రుతుజా (వైస్ కెప్టెన్), ఖుష్బూ, మాధురి కిండో (గోల్‌కీపర్లు), నీలమ్, జ్యోతి సింగ్, రోప్నీ కుమారి, మహిమా టెటె, మంజూ చోర్సియా, జ్యోతి ఛత్రి, హీనా బానో, సుజాత కుజుర్, సాక్షి రాణా, ముంతాజ్ ఖాన్, అన్ను, దీపిక సోరెంగ్, మోనిక టొప్పో, సునెలితా. రిజర్వ్: నిరూపమా దేవి, ఈదుల జ్యోతి.

జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రెండు పతకాలు గెలిచింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం, టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ 145–145 (8/9) 'షూట్ ఆఫ్'లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ చేతిలో ఓడిపోయింది. నిర్ణీత 15 బాణాల తర్వాత ఇద్దరి స్కోర్లు సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందు ఇద్దరికి ఒక్కో షాట్ అవకాశం ఇచ్చారు. జ్యోతి సురేఖ బాణం 8 పాయింట్ల వృత్తంలోకి వెళ్లగా... పంజాబ్‌కు చెందిన 18 ఏళ్ల పర్ణీత్ కౌర్ 9 పాయింట్ల షాట్‌తో తొలి అంతర్జాతీయ వ్యక్తిగత స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత బృందం కాంపౌండ్ టీమ్ ఫైనల్లో 234–233తో చైనీస్ తైపీని ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఇప్పటి వరకు ఏడుసార్లు ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న జ్యోతి సురేఖ ఓవరాల్‌గా 5 స్వర్ణాలు, 5 రజతాలు, 2 కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో అదితి–ప్రియాంశ్ జోడీ 156–151తో కనోక్‌నాపుస్–నవాయుత్ (థాయ్‌లాండ్) జంటను ఓడించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో అభిషేక్ వర్మ 147–146తో జూ జేహూన్ (దక్షిణ కొరియా)ను ఓడించాడు.

కివీస్‌కు సెమీస్ పిలుపు!

- న్యూజిలాండ్‌కు సెమీస్ బెర్త్ లాంఛనం
- శ్రీలంకపై 5 వికెట్లతో గెలుపు
- పాకిస్తాన్ ఆశలు గల్లంతు!

గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్ కీలక సమరంలో తమ సత్తా చాటింది. టోర్నీలో వరుసగా నాలుగు విజయాల తర్వాత నాలుగు పరాజయాలతో తమ పరిస్థితిని క్లిష్టంగా మార్చుకున్న కివీస్ ఆఖరి ఆటలో స్థాయికి తగ్గ ప్రదర్శనను కనబర్చి దాదాపు సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. చివరి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన ఆ జట్టు మరే జట్టుపై ఆధారపడకుండా తమ సెమీస్ అవకాశాలను తానే సృష్టించుకుంది. కివీస్ గెలుపుతో పాకిస్తాన్ సెమీస్ ఆశలు చేజారాయి. సాంకేతికంగా, అంకెల ప్రకారం పాక్ పూర్తిగా, అధికారికంగా నిష్క్రమించకపోయినా... అసాధ్యమైన, ఊహకు కూడా అందని తరహాలో ఆ జట్టు తర్వాతి మ్యాచ్‌లో గెలవాల్సిన నేపథ్యంలో వాస్తవికంగా చూస్తే పాక్ ఆట ముగిసినట్లే!



బెంగళూరు: పదునైన బౌలింగ్, ఆపై దూకుడైన బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ వరల్డ్‌కప్ లీగ్ దశను ఘనంగా ముగించింది. సెమీస్ అవకాశాలు నిలిచి ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో చెలరేగిన ఆ జట్టు తమ లక్ష్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసింది. గురువారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 46.4 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ పెరీరా (28 బంతుల్లో 51; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. 10 ఓవర్లలోపే 70/5 స్కోరుతో కుప్పకూలేందుకు సిద్ధమైన లంక... చివర్లో మహీశ్ తీక్షణ (91 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు) రాణించడంతో ఈ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (3/37)తో పాటు ఇతర కివీస్ బౌలర్లు సత్తా చాటి ప్రత్యర్థిని పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 23.2 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు సాధించింది. కాన్వే (42 బంతుల్లో 45; 9 ఫోర్లు), రచిన్ రవీంద్ర (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 74 బంతుల్లోనే 86 పరుగులు జోడించి విజయానికి పునాది వేయగా, మిచెల్ (31 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఫలితంతో న్యూజిలాండ్ సెమీస్‌కు చేర డం దాదాపుగా ఖాయం కాగా... కివీస్ ఓటమిపై ఆశలు పెట్టుకున్న పాక్, అఫ్గానిస్తాన్‌కు నిరాశ తప్పలేదు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) లాథమ్ (బి) సౌతీ 2; పెరీరా (సి) సాన్‌ట్నర్ (బి) ఫెర్గూసన్ 51; మెండిస్ (సి) రచిన్ (బి) బౌల్ట్ 6; సమరవిక్రమ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 1; అసలంక (ఎల్బీ) (బి) బౌల్ట్ 8; మాథ్యూస్ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 16; ధనంజయ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 19; కరుణరత్నే (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 6; తీక్షణ (నాటౌట్) 38; చమీర (సి) బౌల్ట్ (బి) రచిన్ 1; మదుషంక (సి) లాథమ్ (బి) రచిన్ 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (46.4 ఓవర్లలో ఆలౌట్) 171. వికెట్ల పతనం:** 1–3, 2–30, 3–32, 4–70, 5–70, 6–104, 7–105, 8–113, 9–128, 10–171. **బౌలింగ్:** బౌల్ట్ 10–3–37–3, సౌతీ 8–0–52–1, ఫెర్గూసన్ 10–2–35–2, సాన్‌ట్నర్ 10–2–22–2, రచిన్ 7.4–0–21–2, ఫిలిప్స్ 1–0–3–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) ధనంజయ (బి) చమీర 45; రచిన్ (సి) ధనంజయ (బి) తీక్షణ 42; విలియమ్సన్ (బి) మాథ్యూస్ 14; మిచెల్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 43; చాప్‌మన్ (రనౌట్) 7; ఫిలిప్స్ (నాటౌట్) 17; లాథమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (23.2 ఓవర్లలో 5 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1–86, 2–88, 3–130, 4–145, 5–162. **బౌలింగ్:** మదుషంక 6.2–0–58–0, తీక్షణ 7–0–43–1, ధనంజయ 2–0–22–0, చమీర 4–1–20–1, మాథ్యూస్ 4–0–29–2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	8	4	4	8	-0.338
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా × అఫ్గానిస్తాన్

వేదిక: అహ్మదాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

287 పరుగుల తేడాతో గెలిస్తేనే పాక్ ముందుకు...

అక్షరాలా 287 పరుగులు... శనివారం ఇంగ్లండ్‌పై ఇంత భారీ తేడాతో విజయం సాధిస్తేనే పాకిస్తాన్ జట్టు ముందంజ వేసే అవకాశం ఉంటుంది. అంటే పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి కనీసం 300 పరుగులు చేస్తే ఇంగ్లండ్‌ను 13 పరుగులకు పరిమితం చేయాలి! 350 చేస్తే 63 పరుగులకు, 400 చేస్తే 112 పరుగులకు పరిమితం చేయాల్సి ఉంటుంది. వన్డేల్లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా పాక్ జట్టు 400 పరుగుల స్కోరు దాటలేదు. ఇంగ్లండ్ ఏ జట్టుకూ 400 పరుగులు సమర్పించుకోలేదు. ఇంగ్లండ్‌ను నిలువరించడం సంగతేమో కానీ పాక్ ప్రస్తుత ఫామ్ చూస్తే ఆ జట్టే కనీసం 300 పరుగులు చేసే స్థితిలో లేదు. అసలు 287 పరుగులు చేస్తే గానీ లెక్క రాసే అవకాశం కూడా లేదు! ఇక ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంటే మాత్రం టాస్ వద్దే పాక్ జట్టు ఖేల్ ఖతం. ఎందుకంటే ఎంతటి లక్ష్యమైనా పాక్ 3 ఓవర్లలోపే ఛేదించాల్సి ఉంటుంది! ఇది ఏ రకంగానూ ఊహకు కూడా అందనిది. ఇక నేడు దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్తాన్ అయితే ఏకంగా 438 పరుగుల తేడాతో గెలవాలి కాబట్టి మరో చర్చే అనవసరం. దీనిని పక్కన పెడితే ఈ నెల 15న ముంబైలో భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీఫైనల్... 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య రెండో సెమీఫైనల్ జరగడం ఖాయం.

మెగ్ లానింగ్ గుడ్‌బై

- అంతర్జాతీయ మహిళల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా స్టార్
- ఏడు ప్రపంచకప్ టైటిల్స్‌లో భాగస్వామి



మెల్‌బోర్న్: మహిళల క్రికెట్‌కే మకుటం లేని మహారాణి మెగ్ లానింగ్. ఆటతో, సారథ్య నైపుణ్యంతో ఆస్ట్రేలియా జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ విజయవంతమైన సారథి, 13 ఏళ్ల ఫలప్రదమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఆస్ట్రేలియా అమ్మాయిల క్రికెట్లో ఎవర్‌గ్రీన్ 'మెగాస్టార్'గా కెప్టెన్ లానింగ్‌కు పెట్టింది పేరు. 31 ఏళ్ల వన్నె తగ్గని ఈ క్రికెటర్ తన ప్రతిభా పాటవాలతో ఏకంగా ఏడు ప్రపంచకప్ విజయాల్లో భాగమైంది. ఇందులో ఐదు టైటిల్స్ ఆమె కెప్టెన్సీలోనే వచ్చాయి. గతేడాది లానింగ్ సారథ్యంలో ఆసీస్ మహిళల జట్టు కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని గెలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపాక మళ్లీ ఆమె బరిలోకి దిగలేదు. ఆరోగ్య సమస్యలతో ఇంగ్లండ్, వెస్టిండీస్ పర్యటనలకు దూరంగా ఉంది.

ఇలా అరంగేట్రం: జన్మతః సింగపూర్ అమ్మాయి అయిన మెగ్... న్యూజిలాండ్‌తో 2010లో జరిగిన టి20తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ కూడా ఈ ఫార్మాట్‌లోనే ఆడింది.

అలా సంచలనం: పిన్న వయసు (21 ఏళ్లు)లోనే కెప్టెన్ అయిన 'ఆసీస్ యంగెస్ట్ క్రికెటర్'. ఒక వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు (1232) చేసిన కెప్టెన్‌గా ఘనత. టి20ల్లో అత్యధికంగా వంద మ్యాచ్‌ల్లో సారథ్యం వహించిన తొలి కెప్టెన్‌గానూ రికార్డు. మెగ్ లానింగ్ మొత్తం 179 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించగా, ఆమె కెప్టెన్సీలో ఆసీస్ జట్టు 146 మ్యాచ్‌ల్లో గెలిచింది.

'కప్'ల కహాని: రెండు వన్డే వరల్డ్‌కప్‌లు (2013, 2022), ఐదు టి20 ప్రపంచకప్ (2012, 2014, 2018, 2020, 2023)లలో విజయవంతమైన కెప్టెన్‌గా, బ్యాటర్‌గా నిరూపించుకుంది. లానింగ్ సారథ్యంలో ఆసీస్ 2022 వన్డే వరల్డ్‌కప్‌లో, 2014, 2018, 2020, 2023 టి20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిచింది.

బ్యాటింగ్‌లో సునామీ: న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో కేవలం 45 బంతుల్లోనే వేగవంతమైన సెంచరీ సాధించిన ఆసీస్ క్రికెటర్‌గా రికార్డు.

కెరీర్ ప్రొఫైల్: ఆరు టెస్టులు ఆడి 345 పరుగులు, 103 వన్డేల్లో 4602 పరుగులు సాధించింది. ఇందులో 15 సెంచరీలు, 21 ఫిఫ్టీలున్నాయి. 132 టి20ల్లో 3405 పరుగులు చేసింది. 2 శతకాలు, 15 అర్ధసెంచరీలున్నాయి. ఓవరాల్‌గా 241 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కలిపి లానింగ్ 8,352 పరుగులు చేసింది.

'టాప్' మహారాష్ట్ర

ముగిసిన జాతీయ క్రీడలు

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర 1994 తర్వాత తొలిసారి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. గురువారం ముగిసిన ఈ క్రీడల్లో మహారాష్ట్ర 80 స్వర్ణాలు, 69 రజతాలు, 79 కాంస్యాలతో కలిపి మొత్తం 228 పతకాలతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఓవరాల్ చాంపియన్ హోదాలో రాజా భళీంద్ర సింగ్ ట్రోఫీని మహారాష్ట్ర సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో తమిళనాడు స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ 'ఉత్తమ అథ్లెట్'గా... మహిళల విభాగంలో ఒడిశా జిమ్నాస్ట్‌లు సంయుక్త, ప్రణతి నాయక్ 'ఉత్తమ అథ్లెట్స్'గా ఎంపికయ్యారు. 42 క్రీడాంశాల్లో 11 వేలకుపైగా క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలు, 5 రజతాలు, 15 కాంస్యాలతో కలిపి 27 పతకాలతో 19వ స్థానంలో... తెలంగాణ 4 స్వర్ణాలు, 10 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి 25 పతకాలతో 22వ స్థానంలో నిలిచాయి. ముగింపు వేడుకలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పతకాల పట్టిక (టాప్-5)

	స్వర్ణాలు	రజతాలు	కాంస్యాలు	మొత్తం
మహారాష్ట్ర	80	69	79	228
సర్వీసెస్	66	27	33	126
హరియాణా	62	55	75	192
మధ్యప్రదేశ్	37	36	39	112
కేరళ	36	24	27	87

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) Editor: V. Murali, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.